# చీకటి తొలగిన రాత్రి

ఉదయం 11-20 అయింది. కలకత్తానుంచి భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు లోకి ఫోకర్ ఫ్రెండ్‌షిప్ ప్లేను రాయంచలా నెమ్మదిగా క్రిందికి దిగి వచ్చి లాండ్ అయింది. నేను, శాంతి, పిల్లలు రన్‌వే దగ్గిరికి నడిచాం.

గేంగ్‌వే మీదనించే నన్నుచూసి మీనాక్షి చేయి వూపింది. పేసెంజర్లని తప్పించుకుని గబగబ ముందుకువచ్చి సంతోషంతో నా చేయి పట్టుకు వూపేసింది. "బావా!.........అబ్బ ఎన్నాళ్ళయింది నిన్నుచూసి.... పదకొండేళ్ళా. పన్నెండేళ్ళా? నా పెళ్ళిలోనేగా మనం కలుసుకోడం" గబగబ నాకేం మాట్లాడడానికి సందీయకుండా తనే మాట్లాడేస్తూంది. ఈ లోపల మీనాక్షి భర్తా పిల్లలు దగ్గిరికి వచ్చారు.

"ఆ, బావా. ఇదుగో మా బుద్ధావతారంగారు. సారీ రామావతారం గారు...." నాలిక కరుచుకుంటూ కొంటెగా అంది. "ఎప్పుడో పెళ్ళిలో చూశావు. మర్చిపోయివుంటావు. ఇదిగో యీ మంకీలిద్దరూ మా పిల్లలు...."

రామావతారం "గ్లాడ్‌టూ మీట్‌యూ" అంటూ షేక్‌హాండిచ్చాడు. నేను శాంతిని, పిల్లల్ని పరిచయం చేశాను. అందరం లవుంజ్ వైపు నడిచాం. "బావా మీ ఉత్కళ దేశాన్ని చూడాలనే ఉత్కంఠతతో వచ్చేను చూశావా, బాబోయ్, ఎంత చక్కని తెలుగు మాట్లాడుతున్నానో....అమెరికాలో పదేళ్ళుండివచ్చి తెలుగు మరిచిపోకపోవడమేకాక, ఇంత అనర్గళంగా మాట్లాడగలిగే నాకు ఓ "పద్మశ్రీ" అయినా యియ్యాలిగదూ! పెద్ద సెక్రటరీవేమో గవర్నమెంటుకి సిఫార్సుచేసి ఓ "పద్మశ్రీ" పారేయించు బావా!" గల గల నవ్వుతూ అంది.

మీనాక్షి ఏం మారలేదు. రూపు మారిందికాస్త... కానీ ఆ చిలిపి తనం ఆ చలాకీతనం ఏం మారలేదు.........నాకు చాలా సంతోషం వేసింది.

"నీ వింకా అలాగే వున్నావన్నమాట. అమెరికా వెళ్ళొచ్చాక మారిపోయి వుంటావను కున్నాను....నీ కొంటె మాటలు అలాగే వున్నాయి...." అంటూ చిన్నప్పటిలా నెత్తిన మొట్టడానికి నా చేయి లేచింది. గబుక్కున చేయి దించేశాను. అటుప్రక్క రామావతారం. యిటు శాంతి!...."ఆగిపోయావేం బావా ! మొట్టికాయవేయి!" అంటూ నవ్వింది మీనాక్షి. నవ్వేశాను నేను.

లవుంజ్‌లో కుర్చీలలో కూర్చున్నాం అందరం సామాను వచ్చే వరకు. పిల్లలు నలుగురూ అప్పుడే మాటలు కలిపేసి ఏవేవో మాట్లాడు కుంటున్నారు. పిల్లలిద్దరూ తల్లిలాగే తెల్లగా గోధుమరంగు జుత్తుతో షైట్ షర్ట్సతో బూట్సుతో అచ్చు దొరల పిల్లలలాగే వున్నారు. మాటల్లోకూడ యాంకీ యాస. అవునుమరి పుట్టడం పెరగడం అంతా అమెరికాలోనేగదా!

రామావతారం ఏదో అమెరికా విశేషాలు, తిరిగివచ్చాక ఇండియాలో తన ఉద్యోగ విషయాలు మాట్లాడుతున్నాడు. మాటల మధ్యలోనే ఎదు రుగా శాంతి ప్రక్కన కూర్చున్న మీనాక్షిని నిశితంగా పరీక్షిస్తున్నాను నేను.

మీనాక్షి చాలా ఆధునికంగా తయారయివుంది. పదేళ్ళపాటు విదే శాల్లో వుండడంచేతో. ఇదివరకటికంటె లావవడంచేతో బాగా రంగువచ్చి నున్నగావుంది. నెత్తిన తట్టంత జుట్టుముడి లిప్‌స్టిక్ పల్చటి విదేశీ షిఫాన్ చీర స్లీవ్‌లెస్ జాకట్టు-నేనెరిగిన మీనాక్షి పెద్ద వాలుజడతో కాటుకకళ్ళతో, తలనిండా పూలతో వొంటినిండా బట్టతో వుండేది. కాలం చాలా మార్పులు తెస్తుంది....అఫ్‌కోర్సు....మీనాక్షేమిటి. అందరూ ఈనాడు ఇలాగే తయారవుతున్నారు. ఎక్కడో శాంతిలాంటి వాళ్ళు తప్ప!!

లగేజ్ వచ్చింది.... అందరం కారులో యింటికి బయలుదేరాం. "బాగానేవుందే మీ భువనేశ్వర్ నీట్‌గా రోడ్లూ అవి" అంది మీనాక్షి వెడుతూంటే. "బొత్తిగా అంత తక్కువ అంచనా కట్టకు ఎంతయినా ఒరిస్సా కేపిటల్ అన్నమాట మర్చిపోకు. మా వూళ్ళో వున్నవి రోడ్లూ బంగళాలే అంతకంటె ఇంకేం కనిపించవు" నవ్వుతూ అన్నా.

రాజ్‌పాత్ మీదుగా ఏభై మైళ్ళ స్పీడులో విక్షేపంలా వెళ్ళచ్చు. పట్టపగలే రోడ్డుమీద మనుష్యులు కన్పించరు. భువనేశ్వర్ అదో అఫీషల్ కాలనీలా వుంటుంది.

పది నిమిషాలలోనే బంగళా పోర్టికోలో కారాపాను. నౌకర్లు సామాను తీస్తూంటె యింట్లోకి ఆహ్వానించాను అందరిని. మీనాక్షి కారు దిగి ఇంట్లోకి రాకుండానే చుట్టూ పూలమొక్కలని చూసివచ్చింది. "ఎన్నాళ్ళయిందో పూల మొక్కలని, ఖాళీ జాగాని చూసి, అమెరికాలో వున్నన్ని రోజులూ రెండు గదుల కాపురం. కలకత్తా వచ్చాక ఫ్లాట్‌పైపు ఇల్లు. మొక్కలంటె రావు పట్టుకుంది అంది." ఓ విరిసీ విరియని గులాబి తలలో పెట్టుకుంటూ.

"రా, రా, లోపలికి-ముందు కాఫీ అది త్రాగుదురుగాని, తోటకేం తరువాత రోజంతా కుర్చీవేసుకు అక్కడే కూర్చుందురుగాని." అన్నాను.

ఇల్లంతా ఓ చుట్టు తిరిగి చూసివచ్చింది మీనాక్షి. డైనింగ్ టేబుల్ దగ్గర శాంతి కాఫీ కలుపుతూంది.... రామావతారం పైపు వెలిగించు కుంటున్నాడు. పిల్లలు అప్పుడే తోటలోకి పరిగెత్తారు.

"ప్చ్ బావా! అన్యాయం ఎంత అన్యాయం జరిగింది?...." మీనాక్షి కూర్చుంటూ అదోలా కొంటెగా నవ్వుతూ.

నేను ఆశ్చర్యంగా చూశాను. రామావతారం శాంతి ఇద్దరుకూడా కాస్త ఆశ్చర్యంతో మొహాలుపెట్టారు. "అలా చూస్తావేమిటి. ఈ ఇల్లు ఈ తోటకంతటికి యజమానురాలవాల్సినదాన్ని వెధవది మూడు నాలుగు గదుల ఫ్లాటుల్లో కాపురం చెయ్యాల్సి రావటం అన్యాయం కాదంటావా?"

నా మొహంలో రక్తం పొంగింది. శాంతి క్రింది పెదివి నొక్కి పట్టి కాఫీ కప్పుల్లో పోస్తూంది. రామావతారం పైపుకూరుతూ ఏకాగ్రతగా దాని వైపు చూస్తున్నాడు.

"బావా నీవు ఐ. ఎ. ఎస్. ఓ రెండేళ్ళముందయుంటే ఎంత బాగుం డేది....యీ బుద్ధావతారం బారినుంచి తప్పించుకు నుండేదాన్ని...." చిలి పిగా మొగుడివైపుచూస్తూ అంది.

"మీనాక్షీ!" గాభరాగా వారించాను. శ్రుతి మించి రాగాన పడుతోంది మీనాక్షి వ్యవహారం. అతనేమన్నా అనుకుంటాడనికూడా లేనట్టుంది మీనాక్షికి.

నా కలవరపాటుచూసి అతను నవ్వుతూ చేత్తో వారించాడు. "ఫరవా లేదులెండి యీవిడ సంగతి నాకేం క్రొత్తకాదు." డోంట్‌వర్రీ అన్నాడు

శాంతి కప్పులందరికి అందించింది. పిల్లల్ని పిలిచి బిస్కట్లు ఇచ్చింది. మీనాక్షి పిల్లలు అతి బుద్ధిమంతులులా వున్నారు. లేక విదేశి మానర్సు బాగా వంటబట్టినట్టున్నాయి...."కెన్ వుయ్‌హేవిట్ మమ్మి" అంటూ తల్లినడిగి మరీ తీసుకున్నారు బిస్కట్లు....

"అబ్బబ్బ....వెధవలు వెధవమానర్సులు వీళ్ళూ....ప్రతిదానికి కేన్ వుయ్ షల్‌వుయ్ అంటూ చంపుతారు హాయిగా తీసుకుతినకుండా." విసుగుతో హాస్యం మేళవించి అంది మీనాక్షి.

"అంత బుద్ధిమంతులన్నమాట మీ పిల్లలు. సంతోషించాల్సింది పోయి అలా అంటావేమిటి ?" అన్నాను.

"ఆవిడ అంతేలెండి. వాళ్ళు బుద్ధిగావుంటే బుద్ధిగా వున్నారని విసుక్కుంటుంది. అల్లరిచేస్తే అల్లరి చేశారని తిడ్తుంది....ఆవిడ సంగతి వది లేయండి."

"డాడీ....కెన్‌వుయ్‌గో అండ్ ప్లెయిన్ దగార్డన్...." పిల్లలు తండ్రినడిగారు.

"అఫ్‌కోర్స్.... గో.... అండ్ అంజాయ్" పిల్లలు ఎగురుకుంటూ వెళ్ళిపోయారు....

"చూశావా, హాయిగా తోటలోకిపోయి ఆడుకోడానికి పర్మిషన్ ఎందుకోచెప్పు.... వాళ్ళు పుట్టిన ఇన్నాళ్ళకి ఇంటిముందు వాళ్ళకి ఆడుకో డానికి జాగావుంటే ఆడుకోకూడదూ.... నేనయితేనా...."

"ఆ నీవు ఇండియాలో.... అందులో ఆంధ్రలో పుట్టావు.... వాళ్ళు అమెరికాలో పుట్టారు.... వాళ్ళూ నీవూ ఒకటెలా అవుతారు!" పెళ్ళాన్ని టీజ్ చేశాడు రామావతారం.

"ఆ. చూశాంలెండి అమెరికాని...." వుడుక్కుంది మీనాక్షి. "ఎంత డబ్బిస్తేమాత్రం ఏం లాభం? రెండు గదుల కాపురం. ఏమో, బావా మొదట్లో అన్నీ చూసేవరకు నాకూ చాలా ఉత్సాహంగానే వుండేది. ఓ రెండేళ్ళు మూడేళ్ళు బాగుంది. తర్వాత ఇండియా ఎప్పుడొస్తానా అని పించేదనుకో. మనదేశం ఆదేశం ముందు అన్ని విధాలా తీసికట్టే అనుకో, ఎంతయినా మాతృ దేశం మాతృదేశమే. ఏమంటావు బావా!" నావైపు తిరిగి అంది.

"నేనేఁ అంటాను. నేనేఁ అమెరికా వెళ్ళలేదుగా...." నవ్వాను.

"ఏమోనండీ బోలెడు జీతం చీకూచింతాలేని బ్రతుకు. హాయిగా లైఫ్ వుండేది. నాకయితే అసలు రావడం ఇష్టంలేదు. ఈవిడ పోరు పడలేక వచ్చాను." రామావతారం బూట్లువిప్పి సావకాశంగా కుర్చీకి జార గిలబడి అమెరికా కబుర్లు మొదలుపెట్టాడు.

మీనాక్షి బట్టలు మార్చుకోడానికి లోపలికి వెళ్ళింది పిల్లల్నితీసు కుని. రామావతారంచెప్పే కబుర్లు వింటున్నా నా మనసెంకెక్కడికో వెనక్కి పరిగెడుతూంది! ఇందాక మీనాక్షి అన్న మాటలు వినగానే పాత సంగతులు గుర్తుకు రాక మానడంలేదు.

అవును ఆనాడు యింట్లోవుండి చదువుకునే ఈపూర్ బి. యస్సీ డిగ్రీ మేనల్లుడు మామయ్యకి పనికిరాలేదు. అందుకే ఇంజనీరింగ్ డిగ్రీ

వున్న అల్లుడిని వెతికి తెచ్చి కూతురికి పెళ్ళిచేశాడు. పాపం మామయ్యా తప్పేముంది. ఆ దమ్మిడి ఆస్తిలేని ఉత్త బి. యస్సీ అయిన మేనల్లుడు ఐ. ఎ. యస్. అవుతాడని. ఈనాడు పెద్ద హోదాలో వుంటాడని భవిష్యత్తు తెలుసుకోడానికి మామయ్యేం దేవుడా ? పెళ్ళిచేసి, అల్లుడికి ఫారెన్ ఛాన్స్ వస్తే కూతురికి డబ్బుపెట్టి విదేశం పంపాడు అల్లుడితో. ఆ వెళ్ళడం వెళ్ళడం పదేళ్ళుండి పోయారు. మీనాక్షివాళ్ళు. ఆర్నెల్ల క్రితమే ఇండియా వచ్చారు. రాగానే రామావతారానికి కలకత్తాలో ఓ విదేశీ కంపెనీలో పెద్దజీతం మీద ఉద్యోగం దొరికింది. ఉద్యోగం చూసుకునే వచ్చాడు అని చెప్పాలి!....

....అబ్బబ్బ.... మీ అమెరికా కబుర్లు ఆపండి బాబూ. విని విని బోరెత్తుతున్నాను.... మీనాక్షెప్పుడు వచ్చిందో చూడనేలేదు నేను.

"ఆ....బావా, ఈ కబుర్లకేంగాని....మీ సంగతులు చెప్పు ....ఈ వూళ్ళో ఏమేం చూడాలో అన్నీ చెప్పు" సిగవిప్పి జడ అల్లుకుంటూ అంది మీనాక్షి.

ఈ వూళ్ళో పెద్దగా ఏమున్నాయి చూడటానికీ, మ్యూజియం ఒకటుంది అంతే....ప్రక్కన ఖండగిరి, ఉదయగిరి కేవ్స్ వున్నాయి. ఓ వలభై మైళ్ళ దూరాన పూరి కోణార్క వున్నాయి. ఓ పద్నాలుగు మైళ్ళ దూరాన "నందన్ కానన్" అనే జ్యూలాజికల్ పార్క్ వుంది....నూటయాభై మైళ్ళలో గోపాల్‌పూరుంది .... చిలకావుంది .... అటుప్రక్క హీరాకుడ్ వుంది, ఇటుప్రక్క రౌర్ కెలావుంది.... యివీ మా ఒరిస్సాలో చూడాల్సినవి. ఇంక నీ యిష్టం చెప్పు.... ఏమేం చూస్తావో. రేపటినించి అన్నీ తిప్పేస్తాను ...." నవ్వుతూ గుక్కతిప్పుకోకుండా అప్పగించాను. ఒరిస్సాలో చూడాల్సినవి.

"ఏమో బావా, నీ యిష్టం, నీ ఓపిక ! పదిహేను రోజులు శెలవు పెట్టేసి వచ్చాం....నీ గెస్టులం. మమ్మల్ని ఎంటర్‌టైన్ ఎలా చేస్తావో చూస్తాను....నీ ఉత్తరం రావడం తడువు వచ్చేశాను."

"ఓ సరే, చెప్పావుగా....వద్దుబాబూ ఇంక చాలు అనేవరకు త్రిప్పేస్తాను....నాకూవుంది బోలెడు శెలవు. రేపటినించే తిరగడం ఆరంభిద్దాం. ఇవాలిటికి రెస్టు తీసుకోండి....ఓకే...."

"ఏం కష్టపడ్డామని రెస్టుతీసుకోడానికి ఓ గంట ప్లేను ప్రయాణమేగా చేశాం...."

"పోనీ సరదాగా ఇవాళంతా కబుర్లు చెప్పుకుందాం ...." అన్నాను....

భోజనాలకి ఓ గంటలో పిలుపు వచ్చేవరకు ఏవేవో కబుర్లు చెప్పుకున్నాం....

డైనింగ్ టేబిల్ దగ్గిర అన్ని దగ్గిరుండి ఒడ్డిస్తూంది శాంతి.

"మీరూ రండి, అందరం కూర్చుందాం, ఒకసారే" రామావతారం శాంతినికూడ కూర్చోమన్నాడు. "ఫరవాలేదు లెండి మీరు కానీండి...." నెమ్మదిగా అంది శాంతి.

"రావమ్మా .... మనలో మనకు మర్యాదలెందుకు, అన్నీ మధ్యనున్నాయిగా వడ్డించడానికేముంది" చనువుగా చేయిపట్టుకులాగి కూలేసింది మీనాక్షి.

"మీ వంట వాడెవడు. బాగాచేశాడే అన్నీ....తెలుగు వంటవాడిలాగే వండాడు....మా యింట్లో ఓ నాయరున్నాడు. అన్నీ చప్పగావండి తగలేస్తాడు....నిజంగా అమెరికానించి వచ్చాక ఓ నెల్లాళ్ళు అమ్మ దగ్గిరుండి కరువుదీరా మన భోజనం తిన్నాను.... మళ్ళీ కలకత్తా వచ్చాక నోరు చచ్చిపోయింది. మళ్ళీ ఇన్నేళ్ళకి ఇవాళ తింటున్నాను ...." గోంగూరపచ్చడి కలుపుతూ అంది మీనాక్షి.

"మీ వాడికి శాంతి ఎన్నాళ్ళు దగ్గరుండి ట్రైనింగ్ ఇస్తే ఇప్పటికి నేర్చుకున్నాడు. ఇప్పటికీ పచ్చళ్ళు, పులుసులూ అలాంటివిశాంతిస్వయంగా చేస్తుంది...."

"ఏమో బాబూ. నాకా వంటింట్లోకి వెళ్ళడం అంటేనేబోర్,

ఎలాగో అమెరికాలో తప్పక చచ్చినట్లు ఏదో చేసేదాన్ని....అయినా నా మొహం నాకేం వంటవచ్చు.... పెళ్ళయ్యేవరకు కాఫీ పెట్టుకోడంకూడా రాదు....అక్కడి కెళ్ళాక కొన్నాళ్ళు నానా పాట్లుపడి ఎలాగో కొన్ని తయారుచేయడం నేర్చుకున్నాను...."

"ఎవడయినా మనం చెప్పి చేయించుకోడంలో వుంటుంది. కొన్నాళ్ళు చెప్పకపోతే మన వంటలెలా చేస్తారు....నీవేమో మరి అసలు వంటింటి చాయలకే వెళ్ళవు .... అలాంటప్పుడు వాడేది పెడితే అది తినాలి...." రామావతారం భార్యవంక చూస్తూ అన్నాడు.

"ఆ....వాడి వెనకాలబడి నే చేయడానికా వాడిని పెట్టుకున్నది...." సాగదీసింది మీనాక్షి.

"మరి ఇంక అలాంటప్పుడు వాడివి తిట్టడం మానేయాలి...." రామావతారం శాంతివంటని మెచ్చుకుంటూ సుష్టుగా తిన్నాడు. మీనాక్షి అన్నం ఎక్కువ తినకపోయినా నాలుగు రకాలు కలిపింది. ఎటొచ్చి పాపం ఏంతినందీవాళ్ళ పిల్లలే! ఈ పప్పులు, పులుసులు తినడం. యీ కారాలు అలవాటులేనట్టుంది. అతి కష్టంమీద ఏదోతిని యింకపెరుగు తిన్నారు. భోజనం చేస్తున్నంత సేపూ ఆగకుండా మాట్లాడింది మీనాక్షి.

ఆ కొద్ది సేపట్లోనే, ఆ రెండు గంటల కాలంలోనే నేను కని పెట్టింది ఏమిటంటె రామావతారం అంత మాటకారి కాదని. అవసరానికి మాత్రం మాట్లాడుతాడని అర్థం అయింది. అది గర్వంకాదు అతని స్వభావం చూస్తుంటే మీనాక్షి అతన్ని డామినేట్ చేసినట్టే కనిపిస్తుంది. అతని మాట చొరపడనీయదు. చెప్తుతూంటే వినిపించుకోదు. తన గోల తనదేకాని. అసలే మెత్తనివాడు, మీనాక్షి ధాటికి ఆగలేక యింటి సంగతేకాక వీధి సంగతి మీనాక్షి చేతుల్లో పెట్టేసి ఓ నమస్కారం పెట్టేసి నట్లు మాటలవల్ల తెలుస్తూంది. మీనాక్షి స్వభావం చిన్నప్పటినుంచి తెల్సిన నాకు రామావతారం అలా మారిపోకుండా వుండడంలో ఆశ్చర్యంగా వుందిగాని, మారిపోవడంలో ఆశ్చర్యం ఏం కనిపించలేదు!

మీనాక్షి కోపం. పంతం, దురభిమానం అన్నీ ఓ పాలు హెచ్చే నని అనుభవపూర్వకంగా తెల్సు నాకు. మెట్రిక్ దగ్గరనుంచి బి. యస్సీ వరకు వాళ్ళింట్లో చదువుకొన్న నాకు మీనాక్షి సంగతి తెలియకపోవడం ఏమిటి? ఆ పంతం, కోపం అది గారాల ఏకైక కుమార్తె అవడంనించే వచ్చాయి. స్వతహాగా మీనాక్షి కొంటెదిగాని చెడ్డదిగాదు! అందరిని ఏడిపించడం ఓ హాబీ! ఎవరిని కేర్ చెయ్యకపోవడమేకాక అందరూ తనని కేర్ చెయ్యాలని తన అడుగులకి మడుగు లొత్తాలన్న స్వభావం అవన్నీ ఇంట్లోచేసిన ముద్దువల్లే వచ్చేయని నాకు తెల్సు.

ఆ రోజుల్లో మీనాక్షికి నేనంటే ఎలాంటి అభిప్రాయం వుండేదో యిప్పుడడిగితే నే చెప్పలేను. ఆ రోజుల్లో దీన్నిగురించి ఆలోచించాల్సిన అవసరమూ నాకు లేకపోయింది. ఎంచేత అంటే మీనాక్షి ఎంత "మరద లయినా" వావివరసలన్నీ కుదిరినా మీనాక్షి ప్రక్కన నిలబడే అర్హతలు నాకు, మా కుటుంబానికి ఆనాడు లేకపోవడంచేత కేవలం వాళ్ళింట్లో అవసరార్థాలకి వుండి బుద్ధిగా చదువుకోవడం వరకే తప్ప ఇతరత్రా ఆలోచనలు ఆనాడు నాలో యెన్నడూ జొరపడలేదు. మరి మీనాక్షి ఊహలేమిటో నాకయి నేను యెన్నడూ కనిపెట్టడానికి ప్రయత్నించలేదు. నాతో చనువుగా మాట్లాడేది. అవసర మయినపుడు అథార్టీ చేసి పనులు చేయించుకునేది. ఏనాడన్నా తను చెప్పింది కాదన్నా, చెయ్యనన్నా దెబ్బలాడి మాటలు మానేసేది.

ఒక్కోనాడు మూడ్ నావైపు తిరిగితే ఏ సినిమాకో లాక్కెళ్ళేది. లేకపోతే వారమేసి రోజులు నా చాయలకే వచ్చేదికాదు. మీనాక్షి స్వభావం అంతే అనుకునేవాడినితప్ప కించపడేవాడిని కాను నేను. నేనంటే అభిమానం వుండేదని నాకు తెల్సు కాని, అది నిదర్శనంగా యేపే సాక్ష్యాలు చూపాలో నాకు తెలియచెప్పే మాటలు తెలీవు!........

"ఏమిటి బావా! ఆ ఆలోచన? ........ "డ్రాయింగు రూములో వక్కపొడి వేసుకుని కూర్చున్నాక మీనాక్షివైపే చూస్తూ ఆలోచిస్తున్న నన్ను పిలిచింది.

"ఆ....ఆ....నీ గురించే" నిజమే చెప్పేశాను నవ్వుతూ.

"నా గురించా ?"

"ఊ....చిన్నప్పటి మీనాక్షికి యిప్పుడు మీనాక్షికి తేడా వుందా అని చూస్తున్నాను."

"ఊ .. ఊ ....చెప్పు. మారాననంటావా."కుతూహలంగా అడిగింది.

"శారీరకంగా పదేళ్ళలో వచ్చే మార్పులు తప్ప .... నీలో పెద్ద మార్పే కనపడడం లేదు....ఆ మాటలు అవీ అలాగే వున్నాయి. రామావతారంగారూ. చిన్నప్పుడు మీనాక్షికి ఎంత పంతం వుండేదో తెల్సా, తన మాట నెగ్గేవరకు నిద్రపోయేదికాదు...."

"యిప్పుడు మాత్రం అలా లేదంటారేమిటీ" చిన్నగా నవ్వి అన్నాడు రామావతారం.

"అయితే మీనాక్షి మారలేదంటారన్నమాట."

"ఆవిడ మారుతుందా, తనతో చాలలేక ఓ నమస్కారం పెట్టేసి నేనే మారి వూరుకున్నాను."

"ఆ.... ఆ.... మీ కబుర్లు మా బావ నమ్మడు లెండి! ...."

"నమ్మకపోవడం ఏమిటి నీసంగతి తెలియకపోవడానికి నేనేం క్రొత్తవాడినా .... ఏమో నేను మా అన్నగారి పక్షమేసుమా!" మీనాక్షిని ఏడిపించటానికి అన్నాను.

"ఏమిటమ్మా అక్కా! అక్కవా, చెల్లెలివా. అన్నదమ్ము లిద్దరూ ఏకమైపోతే నన్ను సపోర్టు అన్నా చేయవేం?" శాంతితో దబాయింపుగా అంది మీనాక్షి.

శాంతి తన మామూలు చిరునవ్వు నవ్వి వూరుకుంది. నాకు కాస్త వళ్ళు మండింది. మాట్లాడితే నోట ముత్యాలు రాలుతాయన్నట్లు ఒక మాటయినా మాట్లాడదు శాంతి. యింత సరదాగా అందరం కలుసు

కున్నాం. నలుగురూ సరదాగా కూర్చుని మాట్లాడుకుంటున్నప్పుడయినా నాలుగు మాటలు మాట్లాడకూడదూ ! ఓ చిరునవ్వు ఒలకపోయకపోతే .... యెంతో గే మూడ్‌లో వున్న నాకు శాంతి మామూలు మౌనం చూస్తే యెప్పటిలా తన స్వభావం అని సరిపెట్టుకోలేకపోయాను, అందులో నవ్వుతూ గలగల మాట్లాడుతూ హాస్యాలతో, నవ్వులతో ఇల్లంతా సందడిగా తిరిగే మీనాక్షిని చూస్తూంటే శాంతి యిలా యెందు కుండకూడదు! ఏదో పోగొట్టుకున్నట్లు ఏదో కొంపమునిగినట్లు మొహం పెట్టుకుని మాట్లాడకుండా ఓ మూల కూర్చొపోతే తనూ నవ్వుతూ, తుళ్ళుతూ రోజూ ఎందుకుండకూడదనిపించింది! యింట్లో శాంతిమాట చాలా అరుదుగా వినిపిస్తుంది! అడిగిన దానికి జవాబు చెప్పడం ఏదన్నా కావలిస్తే ముక్తసరిగా అవసరం వున్నంతసేపూ మాట్లాడడం మినహా శాంతి ఎక్కువ మాట్లాడడం నేనూ పెళ్ళయిన తొమ్మిదేళ్ళలో చూడలేదు. ఇంట్లో వంటపని చూసుకోవడం, పిల్లలకి చదువు చెప్పుకోడం, ఏదో ఒక పని పెట్టుకోడం అంతగా ఖాళీ దొరికితే ఓ పుస్తకం పట్టుకు కూర్చోడం తప్ప ఓ స్నేహితులు, కబుర్లు, షికార్లు, సినిమాలు, క్లబ్బులు, అవిఅంతగా అక్కరలేదు శాంతికి. ఎప్పుడయినా వచ్చిందంటే నా పోరు పడలేక, అర డజనుసార్లు అడిగాక విధిలేక బయలుదేరుతుంది శాంతి. శాంతికి పూర్తి వ్యతిరేకం అయిన నేను శాంతి స్వభావానికి సరిపెట్టుకుపోవడం అలవాటు చేసుకుంటున్నాను.

ఎంత స్వభావం అని ఇన్నాళ్ళు సరిపెట్టుకున్నా యీరోజు ఎంచేతో మీనాక్షిని చూస్తూంటె శాంతీ అలావుంటే మా యిల్లు ఇంకెంత అందంగా వుండేదో, యింకెంత స్వర్గంగా మారేదో అన్న ఊహ రాక తప్పలేదు. హోదా, పెద్ద ఉద్యోగం, పరువు, ప్రతిష్ఠ, డబ్బు, చక్కని చదువుకున్న భార్య, ముత్యాలలాంటి పిల్లలు....అన్నీవున్నా శాంతి స్వభావంచేత నాలో కొన్ని ఉత్సాహాలు, సరదాలు చంపుకోవలసివస్తూంది....అదే మీనాక్షిలాంటి భార్య దొరికితే........?! ఆ రోజుల్లో పేకాటతో కబుర్లతో ఎంత సరదాగా కాలం గడిపేస్తున్నా....ప్రతి కదలికలో మీనాక్షిని, శాంతిని పోల్చ

కుంటున్న నాకు అసంతృప్తే కలిగింది శాంతి పట్ల! శాంతిపట్ల అసంతృప్తి మీనాక్షి చలాకీతనం, చిలిపితనం భూతద్దంలో చూపినట్టు మరింతగా మనసుని ఆకట్టుకుంది!

రామావతారం అదృష్టానికి ఆ క్షణంలో కాస్త అసూయనిపించింది.

* * *

మర్నాడు మధ్యాహ్నం తొందరగా భోజనాలుకానిచ్చి, 'నందన్ కానన్' బయలుదేరాం అందరం. పేక, ట్రాన్సిస్టర్, టిఫిన్ కారియరు నిండా ఫలహారాలు, కాఫీ, అన్నీపట్టుకుని సరదాగా పిక్నిక్ బయలుదేరాం. ఒంటిగంటకి అక్కడకు చేరాం, ఎండ బాగా వుంటేగాని కలర్ ఫొటోలు సరిగా రావని ముందు ఫొటోల ప్రోగ్రాం పెట్టాను. పూలమొక్కల దగ్గిర, లేక్ దగ్గిరఏనుగుపిల్ల లదగ్గిరరకరకాలఫోటోలుతీశాను అందరికి. ఎండతగ్గాక మూడున్నరకి కాఫీ ఫలహారాలుచేసి జంతువులను చూద్దామని పిల్లలని పంపించి పెద్దవాళ్ళం నలుగురం జంపుకానాపరచి చెట్టునీడన కూర్చుని పేక మొదలెట్టాం. పిల్లలు పరుగులుపెట్టి ఆడుతున్నారు గోలగా.

ఇదివరకు శాంతితో పిల్లలతో, బంధువులతో ఎన్నోసార్లువచ్చాను, కాని ఎందుకో ఈసారి వున్నంత ఉత్సాహంగా ఎప్పుడూ అనిపించలేదు, బహుశా మీనాక్షి కారణం అయివుంటుంది.

పేకాట ఆడుకున్నంతసేపూ మీనాక్షి జోకులు విసురుతూ,నవ్వుతూ' 'ఏం బావా'అంటూ తొడమీదో బుజంమీదో చరుస్తూ చలాకీగా మాట్లాడుతుంది. మీనాక్షికి అతిమామూలుగా అనిపించే ఆ చర్య నాకు మాత్రం కొంచెం ఇబ్బందిగానే అనిపించింది. మొదటిసారి మీనాక్షి స్పర్శ గిలిగింతలు పెట్టింది. బెరుకుగా రామావతారంవంక, శాంతివంక చూశాను, వాళ్ళు ఇదేం గమనించినట్టులేదు, గమనించినా మీనాక్షి సంగతి తెలిసిన వాళ్లు కనుక అంతగా పట్టించుకుని వుండరు! మీనాక్షికీ మరో ఉద్దేశం వుండకపోవచ్చు. యధాలాపంగా ఎక్సైట్‌మెంట్‌లో అలాచేసివుండచ్చును దానికి వేరే అర్థాలెందుకు అని సరిపుచ్చుకున్నాను. కొంతమంది ప్రక్క-

న్న వాళ్ళని గిల్లడం, కొట్టడం. ఓ దురలవాటు. మగ అధ తేడా వుండదు వాళ్ళకి ఆ ఎక్సైట్‌మెంట్‌లో! మీనాక్షికీ అదే అలవాటేమో.

ఓ గంట ఆడాక అబ్బ 'కాసేపు నడుంవాలుద్దాం బాబూ' అన్నం తినగానే బయలుదేరాం!.........ఆవలిస్తూ బద్ధకంగా ఒళ్లు విరుచుకుంది. మీనాక్షి తలగడమీద ఒరుగుతూ అంది.

"మీరూ పడుకోండి. పదినిమిషాలు!" శాంతి అంది ఓ తలగడ అందిస్తూ రామావతారానికి.

"అబ్బే మధ్యాహ్నం పడక నాకలవాటులేదండి మీరు పడుకోండి' అన్నాడు, లేచి పిల్లల దగ్గరికివెడుతూ, శాంతి మధ్యాహ్నం పడుకోదు. అలవాటున్న నేను ఎవరితో చెప్పించుకోకుండునే మరో తలగడ తలక్రింద పెట్టుకుని కాళ్ళు చాచుకున్నాను.

"అలా తిరిగివస్తాను. పిల్లలేం ఆడుతున్నారో చూసివస్తాను. మీరు పడుకోండి" శాంతిలేచి పిల్లలవైపు వెడుతూ అంది.

వాళ్ళిద్దరూ వెళ్లాక ఓ క్షణం వూరుకుంది మీనాక్షి, చేయిచాస్తే అందేదూరంలోవున్న నా చేయి పట్టుకుని నావంక తదేకంగా ఓ క్షణం చూసింది. నా చేతివేళ్ళల్లో తన వేళ్లు దూర్చింది. "బావా!....నాకు చాలా సంతోషంగా వుంది...." నీకేమనిపిస్తుందోగానీ అంది.

ఆమె చేతిలోవున్న నా చేయి కొద్దిగా వణికింది. ఇబ్బందిగా అటు ప్రక్క చూశాను వాళ్ళిద్దరూ చూస్తున్నారేమోనని. ఖర్మ కాకపోతే ఆడదయిన మీనాక్షికి లేనిభయం నా కెందుకో! చేయి లాక్కోలేక ఇబ్బందిగా చూశాను. బలవంతంగా నవ్వాను...."ఏమనిపించడం దేనికి?"

"అదేమిటి బావా, ఇన్నాళ్ళకి కల్సుకున్నాం ఇద్దరం. సంతోషంగా లేదూ నీకు!"

"అఫ్‌కోర్స్....అదా! ఇంకా ఎమిటో అనుకున్నాను...." సిగరెట్టు వెలిగించుకునే నెపంతో చెయ్యి లాక్కున్నాను.

"నిజంగా బావా, నీ వెప్పుడూ గుర్తుకొచ్చేవాడివి. పెళ్ళయి వెళ్ళి పోయిన దగ్గిరనుంచి, ఎన్నిసార్లు నిన్ను ఎంతగానో చూడాలనిపించేది తెలుసా."

"నిజంగా నామీద నీకంత అభిమానంవున్నట్లు నాకెప్పుడూ తెలియ లేదే!........"

"పో, బావా!....చిన్నప్పుడేదో దెబ్బలాడేదాన్నని అలా అంటు న్నావు కాబోలు, కానీ, మనసులో నీవంటే నాకెప్పుడూ ఇష్టమే బావా!........"

"థేంక్స్!" నవ్వుతూ అన్నాను.

"హాస్యంకాదు బావా!....నా పెళ్ళి....ప్చ్! సరే, ఇప్పుడవన్నీ అను కుని ఏం లాభం, టూ లేట్ కామా....నిజంగా నీవీ ఐ. ఏ. ఎస్. కాస్త ముందయివుంటే మన జీవితాలు ఇంకోలా వుండేవీనాడు....నాకు మన సులో ఒకటి, పైకొకటి చెప్పడం చేతకాదు బావా! ఎవరో ఏదో అను కుంటారని మాట దాచుకోలేను....ఇలా అంటున్నందుకు నీవేం అను కుంటున్నావో?...."

"క్రొత్త సంగతులు నీ నోట వింటున్నాను ఇవాళ...." సిగరెట్టు పొగ పీలుస్తూ సాలోచనగా అన్నాను మీనాక్షివంక చూస్తూ.

"నీకు క్రొత్త సంగతిగాని నాకు కాదు....సర్లే. యిప్పుడెందుకు ఆ గొడవ, నీకిద్దరుపిల్లలు, నాకిద్దరుపిల్లలు ఇద్దరంసుఖంగానేవున్నాంగా...." మొత్తంమీద........నవ్వేస్తూ అంది.

"ట్రూ....ఇలా జరిగితే బాగుండేది, అలా జరిగితే బాగుండును అనుకునేందుకు? టూలేట్! జరగనివి చర్చించి లాభం ఏమిటి?...."

"నిజమేలే....అయినా నిన్ను చూస్తుంటే అలా అనుకోకుండా వుండలేను బావా!...." అంది అదోలాచూస్తూ. రామావతారం రావడం చూసి లేచి కూర్చున్నాను నేను.

"కాఫీ త్రాగుదామా, మూడు కావస్తుంది...." శాంతి. రామావతారం వక్కసారే వచ్చారు. పిల్లలు ఆకలి అంటూ వచ్చారు. మీనాక్షి, శాంతి క్యారియర్ విప్పి ప్లాస్టిక్ పళ్లాలలో కజ్జికాయలు, జంతికలు సర్ది అందించారు. కాఫీలు త్రాగి బిస్కెట్లు సర్ది కారులో పెట్టేసి వచ్చారు. జూ అంతా తిరిగి రావడానికి బయలుదేరాం.

ఎన్నిసార్లో చూసిన ఆ పులులు, సింహాలమీద నాకేం ఇంటరెస్టు లేదు. ముందు నడుస్తున్న మీనాక్షి, శాంతి వంక చూస్తూ కాస్త వెనగ్గా నడుస్తున్నాను. రామావతారం పిల్లలు నలుగురిని కష్టడీలోకి తీసుకుని అన్నీ ఓపిగ్గా వివరిస్తున్నాడు వాళ్ళకి, కాస్త ముందు నడుస్తూ.

వెనుకనుంచి మీనాక్షిని, శాంతిని చూస్తుంటే హఠాత్తుగా ఓ సందేహం వచ్చింది నాకు. మీనాక్షి శాంతి ఇద్దరిలో ఎవరందంగా వుంటారు!? జవాబు చెప్పడం ఎవరికైనా కష్టమే! విడి విడిగా చూస్తే ఇద్దరూ అందగత్తెలే! ఇద్దరిలో ఎవరెక్కువ అంటే ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేరు? సంపంగి పువ్వు, సన్నజాజిమొగ్గ ప్రక్క ప్రక్కనపెట్టి రెంటిలో ఏది ఎక్కువ బాగుంది అంటే జవాబు ఎవరు చెప్పగలరు! దేని అందం దానిది. దేని సౌరభం దానిదే! అలాగే మీనాక్షి శాంతి! ...మీనాక్షి అందంలో బింకం, సౌష్ఠవం కనిపిస్తుంది! శాంతిలో సౌకుమార్యం, లాలిత్యం ఎక్కువ! సన్నజాజి మొగ్గలాగే ముట్టుకుంటే కందిపోయే నాజూకుతనం వుంది! మీనాక్షి గుండ్రంగా, నున్నగా, బింకంగా బంతిలావుంటుంది!మగవాళ్ళ కళ్ళతో చూస్తే మీనాక్షి సెక్సీగా వుందనిపిస్తుంది! మగాడిని కవ్వించే అందం మీనాక్షిది! అది శాంతిలో లేదు!

"ఆకుపచ్చ షిఫాన్ చీరమీద పెద్దపెద్ద గులాబీపూల ప్రింట్, లైట్ గ్రీన్ జాకట్టు, కళ్ళకి కూలింగ్ గ్లాసులు, స్కార్ఫ్‌తో ముందు వెడుతున్న మీనాక్షి నడకలో వయ్యారం వుంది! సన్నంచు లేత, నీలం కంచి చీర, దానికి మోచెయ్యి జాకట్టుతో శాంతి మీనాక్షి ప్రక్కన చాలా నిరాడంబరంగా కనిపిస్తుంది!....శాంతి అంతే....ఈ కాలం వాళ్ళలాగ తయా

రవదు. ఎన్నిసార్లు చెప్పినా అంతే!....అన్ని విషయాలలో మీనాక్షిముందు శాంతి తీసేసినట్టుగానే అనిపించసాగింది నాకు మీనాక్షిని చూస్తుంటే....

జూ అంతా తిరిగి. ఎలిఫెంట్ రైడ్, బోట్ షికారు అన్నీ పూర్తయ్యేసరికి ఆరుగంటలయింది, ఇంటికి వచ్చేసరికి ఏడయింది.

పూరీలో బి.యన్.ఆర్. హోటలు సముద్రం ఎదురుగా వుంటుంది. సముద్రానికి దగ్గరగావుండడంతో వీకెండ్స్‌కి, శలవలకివచ్చే ఫారినర్స్‌తో ఆ హోటలు ఎప్పుడూ నిండుగానే వుంటుంది. రూమ్ కావాలంటే కనీసం ఇరవై రోజుల ముందన్నా బుక్ చేసికోవాలి! ఆ హోటలునుంచి తిన్నగా సముద్రపు ఒడ్డువరకు సిమెంట్‌తో ఫుట్‌పాత్ వేశారు. స్విమింగ్‌కి వెళ్ళ దలచిన వాళ్ళందరూ హోటలులోనే డ్రస్సయి తిన్నగా సముద్రం ఒడ్డుకి వెళ్ళిపోతారు పైన ఏ బాత్‌రోబ్‌వో డ్రెస్సింగ్‌గౌనో కప్పుకుని, హోట లంతా తెల్లవాళ్ళతో, పిలిచేసరికి హాజరయ్యే తెల్లబట్టల నల్ల అటెండర్లతో కళకళలాడుతూ వుంటుంది. విదేశపద్ధతులలో భోజనం, బ్రేక్‌ఫాస్ట్ వగైరాలు సర్వ్ చేస్తారు.

ముందుగానే మా కోసం రెండురూములు బుక్ చేశాను. ఉదయం బయలుదేరి తొమ్మిదిగంటలకల్లా పూరీ వచ్చేశాం. కారు హోటలుముందు ఆగేసరికి తెల్లటోపీలు పెట్టుకున్న బెస్తవాళ్ళు "గదాయిచోకి బాబూ!" అంటూ చుట్టుముట్టారు.

"వీళ్ళెవరు ఏమిటంటున్నారు?" రామావతారం కుతూహలంగా అడిగాడు.

"బెస్తవాళ్ళు.........సముద్రంలో స్నానం చేస్తారా ? అని అడుగు తున్నారు....యీత రానివాళ్ళని పట్టుకుని జాగ్రత్తగా స్నానం చేయి స్తారు....సరిగా యీదలేనివారి ప్రక్కనవుండి జాగ్రత్తగా చూస్తారు.... వీళ్ళకి యిదే వృత్తి. రోజుకి అధమం పదేసి రూపాయలైనా సంపా దిస్తారు. సాధారణంగా యిక్కడికివచ్చే ఫారెనర్స్ అందరూ స్విమ్మింగ్‌కే వస్తారు....పిల్లలని వీళ్ళకి అప్పచెప్పి చూడమంటారు. స్విమ్మింగ్‌కి వెళ్ళి

వస్తారు....కారు రాగానేపట్టుకుంటారు అందరిని" అనిచెప్పాను. "నైవెనై! అమెరోయి చాకు ఆసిచ్చి, పోరే దేఖిధా" అంటూ వాళ్ళని పంపేశాను.

గదుల్లో సామాను సర్దుకుని కాఫీ తెప్పించుకు తాగాం.

"ముందు దేవాలయానికి వెళదామా. సముద్రం దగ్గిరకి వెళదామా?" మీనాక్షిని అడిగాను.

ఆ....ఆ....ముందు సముద్రందగ్గిరకే వెడదాం, స్విమ్మింగ్‌కి అవకాశమేలేదు కలకత్తాలో....పిల్లలకి స్విమ్మింగ్ అంటే చాలా యిష్టం...." చిన్నపిల్లలా సరదాపడి లేచిపోయింది మీనాక్షి. మీనాక్షికి స్విమ్మింగ్ బాగా వచ్చుట! తరచు వీకెండ్స్‌కి సముద్రతీరాలకే వెళ్ళేవారట! స్విమ్మింగ్ సూట్ వగైరా తెచ్చుకుని వచ్చింది.

రామావతారానికి స్విమ్మింగ్ రాదట!

"ఆయనకి నీళ్ళంటేనే భయం....స్విమ్మింగ్ ఏమిటి నామొహం....చెప్పాగా ఉత్త బుద్ధావతారం అని....వెక్కిరిస్తూ" అంది మీనాక్షి. రామావతారాన్ని నేను పిలిస్తే "మీరు వెళ్ళండి....ఐయామ్‌నాట్ ఇంటరెస్టెడ్ ఇన్ స్విమ్మింగ్, మీరంతా వెళ్ళండి....కాసేపు హాయిగా పడుకుంటాను" బద్ధకంగా అన్నాడు.

శాంతి రానంది. శాంతికీ ఈతరాదు. శాంతికీ ఓ విధంగా నీళ్ళంటే భయమే. "పోనీవూరికే ఒడ్డున కూర్చోండి వచ్చి, సముద్రం చూద్దురుగాని రండి...." అనిబలవంతపెట్టాను. మీనాక్షి, నేను ఇద్దరం వెళ్ళాలంటే కాస్త బిడియంఅనిపించి పిల్చాను.

"రండీ బాబూ. ఇంతదూరం పడుకోడానికి వచ్చేరేమిటి అక్కడొచ్చి కూర్చోండి" మీనాక్షి బలవంతపెట్టింది. విధిలేనట్టు లేచాడు రామావతారం.

మీనాక్షి బట్టలు మార్చుకోడానికి వెళ్ళింది. మీనాక్షి పిల్లలిద్దరూ స్విమ్మింగ్ సూట్లు వేసుకుని అప్పుడే తయారయిపోయారు. మా వాళ్ళిద్ద

రికి యీత రాకపోయినా నీళ్ళలో గెంతాలని సరదా! శాంతి ఇద్దరికీ బట్టలు మార్చి చిన్నచిన్న కట్‌డ్రాయర్లు కట్టింది, నేనూ బట్టలు మార్చుకుని, స్విమ్మింగ్ ట్రంక్స్ తొడుక్కుని బాత్‌రోబ్ కట్టుకుని వచ్చాను. బేగ్‌లో తువ్వాళ్ళు పెట్టింది శాంతి.

డ్రస్సయి వచ్చిన మీనాక్షివంక చూడ్డానికి నాకు కాస్త అదోలా అనిపించింది. సిగ్గుపడి మొఖం త్రిప్పుకున్నాను. ఆకుపచ్చ బికినీ, పైన తొడుక్కున్న పల్చటి నైలాన్ నెగోలీలోంచి కనిపిస్తూంటే అదోలా ఫీల య్యాను. మన ఆడవాళ్ళు స్విమ్మింగ్ సూట్లు, బికినీలు కట్టుకోడం అల వాటు లేకపోవడం చూడకపోవడంనించి అలా అనిపించి వుంటుంది. విదేశంలో యిది సర్వసాధారణం. స్విమ్మింగ్‌లు అవి బాగా అలవాటయిన మీనాక్షి ఏ మాత్రం సంకోచం లేకుండావచ్చి నిల్చుంది.

సముద్రం దగ్గిరికి రాగానే పిల్లలని ఇద్దరు బెస్తవాళ్ళకి అప్ప చెప్పాం, జాగ్రత్తగా స్నానం చేయించమని చూడమని, రామావతారం శాంతీ, ఇసుకలో కూర్చున్నారు. బీచి వడ్డంతా విదేశీ స్త్రీ, పురుషులతో నిండివుంది. కొంతమంది యీత కొడ్తున్నారు....స్విమ్మింగ్‌అయి అలసి పోయి కొందరు, ఇసుకలో పడుకుని సూర్యరశ్మి తడి శరీరాలకి యింకించు కుంటున్నారు....పిల్లలు ఒడ్డున గెంతుతూ ఆడుకున్నారు. మరి కొంత మంది నీటిలో బంతిఆట ఆడుతున్నారు. ఇద్దరిద్దరు బెస్తవాళ్ళు యీత రానివాళ్ళని చెరోచెయ్యి పుచ్చుకుని దూరంగా సముద్రంలోమంచి పైకి లాగుతున్నారు....

ఎప్పుడూ నిండుగావుండే పూరీ సముద్రపు ఒడ్డున అందంగాతీర్చి దిద్దడానికి ప్రభుత్వం ఎందుకు పూనుకోదో నా కర్థంకాదు. ఎంతోమంది విదేశీయులు వచ్చిపోయే ఆ బీచి ఒడ్డున సరిఅయిన ఏర్పాటులు ఏమీలేవు. బట్టలు మార్చుకోడానికిగాని, మరీఎండగా వున్నప్పుడు కూర్చోడానికి నీడ వున్న ప్రదేశాలు, అలసి సొలసినవారికి చల్లని పానీయాలు లభ్యమయ్యే కాంటీన్ ఏర్పాటులు, విద్యుచ్ఛక్తి వగైరా సదుపాయాలుఎందుకు చేయరో? అక్కడక్కడ యీతచాపలు దడిలా కట్టారు బట్టలు మార్చుకోడానికి, నీడ

కోసం, అని చూసి విదేశీయులు ఎంత నవ్వుకుంటారోనన్న బాధన్నాలేదు మన ప్రభుత్వానికి। ఏ సదుపాయాలు లేకపోయినా పూరీ సముద్రం ప్రసిద్ధి గాంచడానికి కారణం ఒక్కటే కనిపిస్తోంది నాకు. ఈస్టరన్ ఇండియాలో అంటే బీహార్, బెంగాలు, అస్సాం, వగైరా రాష్ట్రాలకంతటికీ దగ్గరగా సముద్రతీరం ఒరిస్సాలో పూరీలోనే వుండడంచేత, సముద్రం అంటే వెర్రెత్తిపోయే విదేశీయులందరూ సెలవలకి పూరీయే వస్తుంటారు. కలకత్తానుంచి ప్లేనులో భువనేశ్వర్‌వచ్చి అక్కడనించి కారుల్లో వీకెండ్‌కి పూరీ వెళ్ళే ఎందరో విదేశీయులను చూశాను. అందుకే భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో ఎందరెందరో విదేశీయులు కనిపిస్తారు. పూరి బీచ్‌ని అందంగా తీర్చిదిద్ది ఇంకొన్ని వసతులు కల్పిస్తే ఇంకా అనేకమంది విదేశీయులని ఆకర్షిస్తుందనడానికి సందేహంలేదు.

మీనాక్షి నేను స్విమ్మింగ్‌కి బయలుదేరాం....మీనాక్షి ఏ మాత్రం సంకోచం లేకుండా నెగిలిజీ విడిచేసి నీళ్ళవైపు పరిగెత్తింది. కాని మీనాక్షి ముందు వుత్త స్విమ్మింగ్ సూట్‌తో నిల్చోవాలంటే నాకే ఎందుకో సిగ్గనిపించింది।

శాంతి మాట్లాడకపోయినా ఆమె కళ్ళు నన్ను, మీనాక్షిని నిశితంగా పరిశీలిస్తున్నాయి. శాంతి ముఖం అదోలా అయిందనిపించింది. మీనాక్షిని ఆ డ్రస్‌లోచూసి రామావతారానికి ఇదంతా అలవాటే గనుక ఏభావమూ కనబడలేదు అతనిలో.

"డోన్ట్ గో టూ ఫార్ మీనా। "పరిగెడ్తున్న మీనాక్షి వెనక కేకేశాడు రామావతారం.

"ఇట్సాల్‌రైట్....సిల్లీ....మరీ చాదస్తం"అంది నవ్వుతూ నాతో.

పేరుకి తగ్గట్టు చాపపిల్లలా చురుకుగా యీదుకుంటూ వెళ్ళిపోతుంది మీనాక్షి. చిన్నప్పుడు బాగా అలవాటున్నా ప్రస్తుతం అలవాటుపోయి మీనాక్షిని అందుకోలేకపోతున్నాను....ఓ అరగంట యీది నీళ్ళల్లో వెల్లకిలా పడుకుని తేలసాగింది మీనాక్షి కాళ్ళు చేతులు ఆడిస్తూ.

ఆ ఒడ్డునుంచి ఎంతదూరం వచ్చామో తెలియదు, అలసట అని పించింది. కొన్ని గజాలదూరం యీదుకుంటూ వెడితే ఒడ్డు కనిపించే ట్టుంది. మీనాక్షితో ఆ మాటే చెప్పాను. అనుకున్నట్టుగానే కొంతదూరం యీదేసరికి ఒడ్డు వచ్చింది. యీ ఒడ్డు అంతా నిర్మానుష్యంగా వుంది. బెస్తవాళ్ళ విరిగిపోయిన పడవలు, చిరిగిన వలలు మాత్రం వున్నాయి.

ఆయాసంతో ఇద్దరం ఇసకలో వాలిపోయాం.

"అబ్బ బావా! చాలాదూరం వచ్చేసినట్లున్నాంగదూ" అంది మీనాక్షి.

"ఊఁ...." అన్నాను మాట్లాడలేక, ఓ ఐదునిమిషాలు వుంటేగాని మాట్లాడలేకపోయాను. తరువాత కళ్ళువిప్పి చూశాను. మీనాక్షి తలక్రింద చేతులు పెట్టుకొని కళ్లు మూసుకుని పడుకుంది. తడిసిన ఆకుపచ్చ బికినీ ఆమె వంపుసొంపులని స్పష్టంగా చూపెడుతోంది. తెల్లగా నున్నగా మెరు స్తూంది శరీరం, ఆమె వంటిమీద నీటిబిందువులు ఎండకి తళతళ మెరు స్తున్నాయి. అలా మీనాక్షిని చూస్తూంటే ఎందుకో నా శరీరం చిన్నగా కంపించింది. ఆ క్షణంలో నా మనసులో ఏ భావం వుందో చెప్పగలిగే మాటలేదు. తదేకంగా చూస్తున్న నేను హఠాత్తుగా మీనాక్షి కళ్ళు తెర వడంతో పట్టుబడ్డ దొంగలా తడబడి చూపు మరల్చుకున్నాను.

"బావా?" అంది మీనాక్షి నా కళ్ళలోకి చూస్తూ, నేను అప్పుడే మీనాక్షిని చూస్తున్నట్టు అటు తిరిగాను....

"అబ్బ! ఎన్ని ముత్యాలో" అన్నాను నవ్వుతూ.

"ఏవి ఎక్కడ?...." హడావిడిగా ప్రక్కకి తిరిగి మోచెయ్యిమీద ఆనుకుని లేచింది మీనాక్షి.

"అవిగో అన్నాను" మీనాక్షి వంటిమీద మెరుస్తున్న నీటి ముత్యా లని చూపిస్తూ.

మీనాక్షి తన శరీరంవంక చూసుకుని అరక్షణం సిగ్గుపడింది. "పో బావా ఇంకా నిజం అనుకున్నాను....పూరీ సముద్రం గవ్వలు, శంఖాలు, వగైరాలకి ప్రసిద్ధిగదా, ముత్యాలుకూడా దొరుకుతాయనుకున్నాను...."

"అమ్మ ఎంత ఆశ! హారం చేయించుకుందామనుకున్నావా?"

మీనాక్షి రెండు దొర్లు దొర్లి నా దగ్గరికివచ్చి మోచెయ్యిమీద ఆని నా మొహంలోకి వంగి చూసింది కొంటెగా. "అమ్మో బావగారికి సరసం కూడా తెలుసన్నమాట" అంది చిలిపిగా నాతడిజుట్టు గుప్పెటతో పట్టుకొని యిటు అటు గుంజింది.

నా మీదికి వంగున్న మీనాక్షి తగిలీ తగలని అర్ధనగ్నశరీరం, వంటిని పూర్తిగా కప్పని ఆ దుస్తులలోంచి కనిపించే మీనాక్షి సౌష్ఠవం చూసి వేడిరక్తం పొంగింది. కళ్ళు గట్టిగా మూసుకున్నాను....లేకపోతే యీ పాడు మనసు శరీరం ఏకంఅయి ఏం చెయ్యకూడనిది చేయిస్తుందో నా చేత!

మీనాక్షికి ఎంత చొరవ! నిర్భయం! పరాయి మగవాడినన్న ఆలోచనకూడా లేనట్టు ఎంత నిర్భయంగా నా ప్రక్కన పడుకుంది!....నామీద అంత నమ్మకమా? లేక నా నిగ్రహం ప్రయోజకత్వం పరిశీలిద్దామనా?.... మీనాక్షి అభిప్రాయం ఏమిటో తెలుసుకోలేకపోయాను. ఆ కళ్ళలోకి ఎంత సేపు చూసినా కొంటెతనం మాత్రం కనిపిస్తుంది........

ఎక్కువసేపు మీనాక్షిని ప్రక్కనుంచుకుని నిగ్రహం చూపటం నా వల్ల కాలేదు! నా శరీరం వశం తప్పకముందే వివేకమో, సంస్కారమో' చెప్పలేను గాని తట్టి లేపాయి....లేక పిరికితనమన్నా కావచ్చు.........చటుక్కున లేచి కూర్చున్నాను....

"పద, మీనాక్షి వెళ్ళిపోదాం" అన్నాను.

"అప్పుడేనా బావా!" అంది ఆదోలాచూస్తూ.

"అప్పుడేనా ఏమిటి? మనం వచ్చి రెండుగంటలపైన అయింది, వాళ్ళు హడావిడి పడుతూంటారు....లే వెళ్ళిపోదాం...." అన్నాను లేచి నిలబడి.

చేతులు రెండు చాచింది విలాసంగా లేపమన్నట్టు, చేతులందించి లాగాను. ఆ లాగడంలో మీనాక్షి ఆ వేగానికి తూలి పడబోయి నాగుండెల

మీద చేతులు ఆన్చి నిల్రదొక్కుకుంది..........మీనాక్షి పడకుండా అప్రయత్నంగా నా చేతులు ఆమె నడుంచుట్టూ తిరిగాయి, ఒక్కక్షణం అలా నిలబడ్డాం ఇద్దరం. ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ, 'మీనాక్షి' అన్నాను బరువుగా. నేనేమయిపోతున్నానో నాకే తెలియని స్థితి అది.

మీనాక్షి కొంటెగా నవ్వింది నా మొహంచూస్తూ...."బావా"అంటూ నా ముక్కు పట్టుకు వూగించి నీళ్ళలోకి పరుగెత్తింది, ఆ "బావా!" అన్న మాటలో "ఇంత పిరికివాడివేమిటి నీవు" అన్న అర్థం స్ఫురించింది.

నిజమే పిరికివాడినే....లేకపోతే ఇలాంటి ఛాన్స్ ఎవరన్నా వదులుకుంటారా?....మరి నేనెందుకు వదిలినట్టు?........జవాబు ఆలోచించడానికి వ్యవధి లేదు....యీదుకుంటూ వెళ్ళిపోతున్న మీనాక్షిని కలుసుకున్నాను.

ఒడ్డుకి చేరేసరికి రామావతారం, శాంతి, పిల్లలు ఎవరూ కనబడ లేదు, బహుశా ఆలస్యమయిపోయిందని హోటలుకి వెళ్ళిపోయివుంటారు. పిల్లలకి స్నానం చేయించిన బెస్తవాళ్లు మమ్మల్నిచూసి దగ్గరికివచ్చి బేగ్ అందించారు. "సే బాబూమానె, యిత్తెపర్యంతు ధేఖికిరి ఎబై కా జాయిచ్చి బాబూ!" అన్నాడు.

"పద వాళ్లు ఇంతవరకు మనకోసం చూసి యిప్పుడే వెళ్ళిపోయారట" తువ్వాలుతో తుడుచుకుని, బాత్‌రోబ్ కప్పుకుని హోటలుకి బయలుదేరాం.

ఇద్దరం హోటలికి వెళ్ళేసరికి పిల్లలకి భోజనాలు పెట్టించేసి మా కోసం చూస్తున్నారు రామావతారం, శాంతి. మేం వెళ్ళగానే రామావతారం కోపంగా మీనాక్షివంక చూశాడు. "ఏనాడనగా వెళ్ళారు....యింత సేపా, నీకసలు ఎక్కడికి వెళ్ళినా వళ్ళు తెలియదు. ఇంకా రారేమిటని మేం యిక్కడ కంగారుపడుతున్నాం...." కేక లేశాడు.

"ఏమయిపోతాను....బావ వున్నాడుగా సాయం!" నిర్లక్ష్యంగా అంది మీనాక్షి లోపలికివెడుతూ. నేనేం అనలేక గిల్టీగా చూశాను. శాంతి నన్నూ, మీనాక్షినీ పట్టిపట్టి చూసింది. మా మొహాలలో భావాలు వెదక

టానికి ప్రయత్నిస్తున్నట్టు....వాళ్ళిద్దరిని తప్పించుకుని లోపలికి వెళ్ళాను.... భోజనాలదగ్గర మాటల మధ్యలోగాని మామూలుగా అనలేకపోయాను.

ఆ సాయంత్రం పూరంతా ఒకసారి తిరిగివచ్చి బీచిఒడ్డున కూర్చు న్నాం. వెన్నెలరాత్రి! సముద్రం చంద్రుడినిచూసి ఎగిరిపడ్తూంది.......... వెన్నెల కెరటాలమీద ధగధగలాడుతూ మెరుస్తూంది! మీనాక్షి, శాంతి ఇద్దరూ పాటలు పాడారు అడగ్గానే. మీనాక్షికి పాటవచ్చని, యింత శ్రావ్యంగా ఆమె గొంతు వుంటుందని ఆనాడే తెలుసుకున్నాను. శాంతి సంగీతం నేర్చుకుంది. ఆమె పాడటంలో వింతలేదు! మీనాక్షి గురించిన నిజాలు నాకేం తెలియవన్నమాట! మీనాక్షి వచ్చిం దగ్గిరనుంచి క్షణ క్షణా నికి మీనాక్షి దగ్గరవుతూంది నాకు! రామావతారం అదృష్టానికి ఆ కొద్ది రోజుల్లోనే ఎన్నోసార్లు అసూయపడ్డాను.

మర్నాడు ఉదయం స్నానంచేసి పూరీ జగన్నాధుని చూడ్డానికి బయలుదేరాం. రామావతారం పట్టుపంచెకట్టి అచ్చతెలుగు వేషం వేశాడు. మీనాక్షి శాంతి పట్టుచీరలు కట్టారు. వాళ్ళందరినిచూసి, పంచె కట్టుకోవడం అలవాటులేని నేను పైజమా, లాల్చీ కట్టుకున్నాను. అయినా ఆ దేవాలయా నికి పేంటుతో వెళితే మళ్ళీ అదెందుకు పనికిరాదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్న నేను క్రిందటిసారిలా టెర్లిన్‌పాంటు పాడుచేసుకోలేక పైజమా కట్టుకున్నాను.

నిజంగా పూరీ దేవాలయం చరిత్ర ప్రసిద్ధమయినదే అయివుండ వచ్చు. ఆ దేముడి మహిమ గురించిన నిజానిజాలు నాకు తెలియవు, గాని ఒకసారి ఆ దేవాలయానికి వెళ్ళివస్తే మరి వెళ్ళబుద్ధిపుట్టదు అని నా ఉద్దే శం! సర్వం జగన్నాధం అంటూ కుండల్లో వుడికించిన అన్నం పప్పు పిడతలు వాటిమీద జుమ్మని ముసిరే ఈగలు. అవిఎంతోభక్తిగా "భోగం" అనుకుంటూ కొనుక్కొని కళ్ళకద్దుకు తినేప్రజలు, గర్భగుడిలో ఆ చీకటి, కాలు క్రిందపెడితే జర్రున జారే ఆ పాకుడు....డబ్బీయడం ఏ మాత్రం తక్కువయినా బండబూతులు తిట్టే పండాలు....... కారు దిగగానే చుటు ముట్టే ఆ పండాలు,..........అదంతాచూస్తే దేముడిమీద భక్తి కలగటం

అటుంచి వున్న భక్తివిశ్వాసాలుకూడా పోయి ఎప్పుడెళ్ళిపోదామా అని పించడం సహజం. దక్షిణాదిని వున్నంత పరిశుభ్రంగా ఉత్తరాదిని దేవాలయాలు వుండవు. అందులో పూరీ, బెనారస్ దేవాలయాలు అపరిశుభ్రతకి ప్రసిద్ధి. ఆ వాతావరణంలో ఓ క్షణంకూడా దేముడిమీద మనసు నిలవదు. అయినా ప్రజలు వెళ్ళడం మానరు! నాలాంటివాళ్ళు యింతదూరం వచ్చాం ఓసారి చూచిపోదాం అనైనా రాక మానరు! అదేమిటో పూరీవెళ్ళి జగన్నాధుని దర్శించుకుని రాలేదంటే అదో వెలితిగానేకాక, ఏదో తప్పు పని చేసినట్టు ఫీలవుతాం అంచేత ప్రతీసారివిసుక్కుంటూనే వెళ్ళడం పరిపాటి!

కారు ఆగడం తడవు ఓ పదిమంది పండాలు చుట్టుముట్టారు దేవుని దర్శనం చేయిస్తామని. ఒద్దు మహాప్రభో అన్నా వినిపించుకోక వెంట పడ్డారు.

మామూలు దేవాలయానికి మాదిరి పళ్ళు, కొబ్బరికాయలు పట్టుకెళ్ళ డానికి లేదు పూరీదేవాలయానికి! ఈగలు ముసిరే లస్కోరావుండలు, పిడతలలో దొరికే రసగుల్లాలు, జగన్నాధుడికి యిష్టంకాబోలు, పూలు, లస్కారా వుండలు కొని లోపలికి వెళ్ళాం. దేవాలయానికివెళ్ళే త్రోవలో లోపలఇరు ప్రక్కలా రకరకాల సైజుల కుండలలో అన్నాలు, పప్పులు కూరలువండి అమ్మకానికి పెడతారు. వాటిని ఆశ్రయించుకుని ఎన్నివేలు, లక్షలు ఈగలు బ్రతుకుతున్నాయో లెక్కలేదు....

"అబ్బ....అదేమిటి ఆ అన్నాలేమిటి.........ఛీ ఛీ....ఈగలు ఎలా వ్రాలుతున్నాయో చూడు!" మీనాక్షి అసహ్యించుకుంది అవి చూసి.

"తప్పు తప్పు .... కళ్ళుపోతాయి అలా అన్నావంటే .... అది మహాప్రసాదం, దానికే రోగాలు అంటవు ఎన్ని ఈగలు వాలినా!" నవ్వుతూ అన్నాను....నవ్వుతూ అన్నా ఆ మాటల్లోకాస్త నిజం వుందేమో అనిపిస్తుంది. రోజుకి ఎన్ని వందలమందో ఆ భోగం కొనుక్కుని తింటూనే వున్నారు....అందరికీ రోగాలు వస్తున్నాయా? అంతేగాక ఆ భోజనం ఎంతో రుచిగా వుంటుందని, ఆ రుచి మనం ఎంతబాగా యింట్లో వండినా రాదని తిన్న అందరూ అంటారు. మన దేవాలయాల్లో దద్ధోజనం

పులిహోరరుచి ఇంట్లోచేసిన దానికి చస్తేరాదు. అలాగేనేమో ఇదీ అది భగవంతుని మహిమో ఏమో! "మనమూ తినాలి. ఆ ప్రసాదం. పూరీవచ్చి అది తినకుండా వెడితే తిన్నగా నరకానికి పోతావు" నవ్వుతూ బెదిరించాను.

"అప్పటి నరకం సంగతి తరువాత కానీ ముందీ నరకంలోంచి నన్ను లాక్కెళ్ళు!"—"మీనాక్షి నీకిష్టంలేకపోతే మానేయికాని, కామెంట్స్ మాను!"రామావతారం కసిరాడు, అతనికి దైవభక్తి, నమ్మకం ఎక్కువట.

ఆ తొడత్రొక్కిడిలో దైవదర్శనం అయిందనిపించుకొని బైట పడ్డాం. మామూలుకంటె ఆ నెలలో పూరీలో విపరీతమైన రష్ వుంది. కారణం జగన్నాధుని "నవ కళేబర్" ఉత్సవం జరుగుతూంది. "నవ కళేబర్" అంటే పన్నెండు సంవత్సరాలకి ఒకసారి జగన్నాధుడు, బలభద్రుడు, సుభద్రాదేవి పాత విగ్రహాలని తీసేసి క్రొత్తవి ప్రతిష్టిస్తారు. ఆ పాతవిగ్రహాలని దేవాలయం ఆవరణలోనే అగ్నిహోత్రానికి అర్పిస్తారు. దాన్ని "కైవల్యవైకుంఠం" అంటారు! అది చూడడానికి వేలకొద్దిప్రజలు వస్తారు. ఆ క్రొత్త విగ్రహాలని ఏ కర్రతోపడితే ఆ కర్రతో చేయడానికి వీలులేదు. దేవస్థానం పూజారులు నెలరోజులు ముందుగా ఆ విగ్రహాలకి కావల్సిన కలపకోసం వెతకడానికి బయలుదేరుతారు! ఆ విగ్రహాలు చేసేందుకు కావల్సిన వేపచెట్టుకి, నేలనించి మూడుగజాల ఎత్తువరకు కొమ్మలు వుండకూడదు. కొమ్మలన్నీ ఆకాశంవైపే వుండాలి, చెట్టు మొదట పాము పుట్ట వుండడం శ్రేష్టం, చెట్టుమీద ఏ పక్షులగూడు వుండరాదు. వేపచెట్టు రావిచెట్టు ప్రక్కప్రక్కన వుండాలి మొదలైన ఏవేవో నిబంధనలు వుంటాయి. అలాంటి చెట్టుకోసం అన్వేషిస్తారు. ఈసారి ఓవింత జరిగింది. ఓ పూజారికి జగన్నాధుడు కలలో కనిపించి నాకోసం ఫలానాచోట ఓ చెట్టుంది, దానితో నా విగ్రహాలు చేయండి, ఆ చెట్టుమీద శంఖ, చక్ర గదా పద్మ చిహ్నాలు వుంటాయి అని చెప్పాడట? ఆ ప్రకారంగానే ఆ చెట్టుని వెతుక్కుంటూ బయలుదేరితే సరిగా కలలోచెప్పిన ఆ చోటులోనే ఆ చెట్టు కన్పించింది. దానిమీద శంఖ, చక్ర, గదా పద్మాల ఆకారం అనవాళ్ళు చెట్టుమీదే సహజంగా వున్నాయి! యింక ఆ వింత చూడడానికి తండోప

తండాలు ప్రజలు వచ్చారు! ఆ చెట్టు నరికి ఉత్సవాలతో ఊరేగింపులతో పూరీ తీసికెళ్ళి విగ్రహాలు తయారుచేసి ప్రతిష్ఠించారు....

ఇదంతా చెపితే మీనాక్షివాళ్ళు ఆశ్చర్యంగా విన్నారు. త్రోవలో ఆ చెట్టు దొరికిన చోటు చూపించాను వెళ్ళేటప్పుడు.

మధ్యాహ్నం అంతా షాపింగ్ చేశారు మీనాక్షి, శాంతి. ఒరిస్సా ఫిలిగ్రీ వర్క్‌కి, కొమ్ముసామానుకి ప్రసిద్ధి! మీనాక్షి "ఫిలిగ్రీ" వస్తువులు చాలా కొంది. డ్రాయింగ్ రూములోకి ఏవేవో డెకరేషన్ సామాను కొంది! జంతువుల చర్మంతో చేసే బూట్లు, పాముచర్మాలతో చేసిన చెప్పులు ఎన్నెన్నో కొంది. గవ్వలతో చేసిన వస్తువులు, పూసలహారాలు కొంది. వెర్రిగా! ఓ రెండు వందలు ఖర్చుపెట్టి వుంటుంది ఆ పూట!

మర్నాడు ఉదయమే బయలుదేరి వచ్చేశాం భువనేశ్వర్.

కోణార్క్ భువనేశ్వర్‌కి నలభై మైళ్ళ దూరంలో వుంది! ఒకప్పటి సూర్యభగవానుని ఆలయం ప్రస్తుతం శిధిలాలయంగా మిగిలింది. పదమూడవ శతాబ్దం నాటిది. గర్భగుడి ముఖద్వారం, సూర్యుడు ఉదయించే తూర్పుదిక్కున వుంటుంది. సూర్యుని ఉదయకిరణాలు సరిగా ఆ విగ్రహం మీద పడేవిట! ప్రస్తుతం సూర్యవిగ్రహం లేదు. పడిపోతున్న ఆ గర్భ గుడిని రాళ్ళుపేర్చి నిలబెట్టారు. అంత ఎత్తుకు ఆ రాళ్ళనుచేర్చి కట్టిన సూర్యరధం చూడగానే ఎలా తెచ్చారీ రాళ్ళను యింత ఎత్తుకు అని ఆశ్చర్యం వేస్తుంది. ఆధునిక పరికరాలు లేకుండానే, సిమెంటు ఇసక వగైరాలు ఏమీ లేకుండా అంత అద్భుతమైన కళా ఖండాన్ని అంత ఎత్తున రాళ్ళలో మలచిన ఆనాటి శిల్పుల కౌశలానికి ఆశ్చర్యపడకుండ వుండలేరు ఎవరూ? సరిగా ఆర్టిస్టిక్ వ్యూతో చూస్తే ఒక్కోప్రక్క ఓ రోజు తక్కువ పట్టదు, ఆ శిల్పకళా వైభవం చూడాలంటే, మనకి తెలియని ఎన్నో అర్థాలతో రాళ్ళని మలిచారు ఆ శిల్పులు! పన్నెండునెలలు పన్నెండు చక్రాలుగా, ఏడుఅశ్వాలువారానికి గుర్తుగాఒక్కోచక్రంలోనిచీలికలుపక్షంగా.... రక రకాలుగా అర్థాలున్నాయి ఒక్కోదానికి. ఒక్కచక్రంలోఅలంకారాలు,

ఆభరణాలుఆనాటి ఆయుధాలు అన్నీ తీర్చిదిద్దారు. అన్నింటికంటె ప్రజలని ఎక్కువఆకర్షించేవికోణార్క దేవాలయంమీదవున్న 'కామసూత్రాల'శిల్పాలు! కొంటె కోణంగులు ముసిముసి నవ్వులు నవ్వుతారు! స్త్రీలు సిగ్గుపడి తలలు తిప్పుకుంటారు! విదేశీయులకే ఆశ్చర్యంగా కనిపించే ఆ శిల్పాలని జాగ్రత్తగా ఖరీదయిన కెమేరాలతో ఫొటోలు తీసుకుంటారు. కావల్సిన వారికి ఆ ఫొటోలన్నీ పైన దొరుకుతాయి దుకాణంమీద! అక్కడ మన దేశీయులకంటె విదేశీయులే కనిపిస్తారు. టూరిజం అంటే మనకంటె విదేశీయులకే ఎక్కువ యిష్టం అనుకుంటా! వాళ్ళకున్న అంగబలం, అర్థబలం మనకు లేవు.

వెంటపడ్డ గైడ్‌ని వద్దని బయలుదేరాం అందరం. నెంబర్ల వారీగా ఎక్కుతూ వెడితే సులభం అవుతుంది వెళ్ళడం! ఉప్పునీటి గాలికి రాళ్ళు కన్నాలుపడి ఆకారాలు పోగొట్టుకుంటున్నాయి. రాయినే కన్నాలు పెట్టగలిగే శక్తివంతమైన గాలి!

"అబ్బ! ఎంత బాగుంది బావా!" మీనాక్షి క్రిందనించే చూసి ఆశ్చర్యంగా నిలబడిపోయింది.

"రియల్లీ, వర్త్ సీయింగ్" రామావతారంకూడా మెచ్చుకున్నాడు.

"ఇక్కడనించే ఏం చూస్తారు. పదండిముందు చుట్టూతిరిగి తరువాత పైకివెడదాం" అన్నాను. చుట్టూ తిరిగిచూసి పైకి ఎక్కడం ఆరంభించాం. కాస్తదూరం ఎక్కేసరికి రామావతారం ఆయాసంతో చతికిలబడిపోయాడు! పాపం స్థూలకాయుడు దానికితోడు పొట్ట! అంతేకాక మరీ పిరికివాడు! అన్నింటికి భయం, చాదస్తం! చకచక పరుగులు పెడ్తున్న పిల్లల్ని పడిపోతారని వెళ్ళద్దని కేకలు పెట్టసాగాడు. మమ్మల్ని జోళ్ళు విప్పేయమని గాభరా పెట్టాడు. జారిపోతారు రాళ్ళమీద అని పిల్లల బూట్లువిప్పి, వాళ్ల అటు ఇటు పరిగెత్తిపోకుండా చేతులు పట్టుకున్నాడు.

"ఇక్కడినించే చూద్దాం. కనిపిస్తూందిగా" అంటాడు రామావతారం.

బాగుంది మీరు రాకపోతే మానేయండి, ఇంతదూరంవచ్చి ఏం

చూడకుండా కూర్చోడానికా వచ్చాను," రామావతారం మాటలు లక్ష్యపెట్ట కుండా పైకి ఎక్కసాగింది మీనాక్షి. నేను మరేం పరవాలేదని నచ్చచెప్పినా రామావతారం పైకి రాలేనన్నాడు.

"మీరు వెళ్ళండి పిల్లల్ని చూస్తూ కూర్చుంటాను అన్నాడు"........ "పిల్లల్ని నేను చూస్తాను నేను ఎన్నిసార్లో చూశాను" అంది శాంతి. మొత్తంమీద రాలేక రామావతారం, ఇంటరెస్టు లేదంటూ శాంతీ ఇద్దరూ క్రిందే వుండిపోయారు. సరదాపడుతున్న పిల్లల్ని జాగ్రత్తగా తీసికెడతానని రామావతారానికి ప్రామిస్‌చేసి పిల్లలు, నేను మీనాక్షి పైదాకా ఎక్కి అన్నీ చూశాము. తిరిగివస్తూ ఆయాసం తీర్చుకోడానికి ఓమూల నీడవున్న రాయి మీద కూర్చున్నాం....పిల్లలు ఎంతచెప్పినా వినకుండా క్రిందికి పరుగెత్తి వెళ్ళిపోయారు....

క్రింద కూర్చున్న రామావతారం, శాంతి బొమ్మలలాగ కనిపిస్తు న్నారు అంత ఎత్తునించి....అలాచూస్తూ హఠాత్తుగా మీనాక్షి అంది "మీ ఆవిడ చాలా అందగత్తెనే బావా!...."

ఏం అంటాను! అందులో రామావతారం ప్రక్క కూర్చుంటె మరీ అందంగా బొమ్మలా కనిపిస్తూంది! ఏదోఒకటి అనాలిగా! "ఆ....అందంగా మలచిన ప్రాణంలేని పాలరాతిబొమ్మ!" నిర్లక్ష్యం ధ్వనించేటట్టు సిగరెట్టు అంటించుకుంటూ అన్నాను.

మీనాక్షిని చూసిం దగ్గరనించి నిజంగా శాంతి ఇంట్లో ఓ ప్రాణం లేని బొమ్మలాగే కనిపిస్తూంది నాకు.

"అదేమిటలా అంటున్నావు!"

"కాకపోతే మరేం అంటాను! నీవే చూస్తున్నావుగా, కదలికలేని బొమ్మలాగే వుంటుంది ఇంట్లో. ఓ చలాకీతనం లేకుండా, డ్రాయింగ్ రూములో డెకరేషన్ పీస్‌లాగ ఇంటికి అలంకారం!...... ...."విరక్తిగా అన్నాను.

"ఊ....మా ఆయనే బుద్ధావతారం అనుకుంటే. మీఆవిడా ఆయన్ని

మించిపోయింది స్తబ్దతనానికి....అబ్బ అలా ఎలా వుండగలరో ఓ మాటా మంతీ సరదాల్లేకుండా....నేను వుండలేను బాబూ....!"

"నీకీ బుద్ధావతారం, నాకీ కూర్మావతారం దొరికాయి...."నవ్వుతూ స్పోర్టివ్‌గా అందామని ప్రయత్నించినా ఆ మాటలో చిన్న విస్పృహ ధ్వనించింది........

"బాగా చెప్పావు....ఆయనా అంతే....దేన్లోనూ సరదాలేదు....సినిమాలంటే ఇంటరెస్టులేదు, క్లబ్బులంతకంటె అక్కరలేదు....ఫ్రెండ్స్ అసలేలేరు, ఎంతసేపూ ఆఫీసు, తరువాత తిండం, పడుకోడం....నాకు వళ్ళు మండిపోతూ వుంటుంది....ఆయనతో లాభంలేదని నా అంతట నేనే సరదాలు తీర్చుకుంటాను....కొన్నిటిని ఆయనకోసం చంపుకోక తప్పడం లేదు...." ఆదోరకంగా అంది మీనాక్షి.

"నీది, నాది ఒకటే కేసు! ఇలాంటి జతలు ఎందుకు కూరుస్తాడో ఆ దేవుడు!....శాంతి అన్నివిధాల అనుకూలవతే... అందం, చదువు.... అన్నీ వున్నాయి....ఇంట్లో దేనికీ లోటులేదు!....మరెందుకు ఆ స్తబ్దత? సరదాగా, చలాకీగా, జల్సాగా బ్రతికే నాల్గురోజులు ఎందుకు బ్రతకకూడదని నేనంటాను! ముందుచూపు వుండాలంటుంది....'ఈరోజు విచ్చలవిడిగా తిరిగి ఖర్చుపెడితే రేపో' అంటుంది....భవిష్యత్తు ఆలోచించాలంటుంది.... ఏదేదో నాన్సెన్స్ చెబుతూ వుంటుంది, కబుర్లుచెప్పమంటే ఫస్టు....ఎంతకని వాదిస్తాను....తనమూలంగా నా సరదాలెన్నిచంపేసుకున్నాను........"ఆదో రకం విరక్తిగా అన్నాను........

బావా! అటుచూడు....ఆ బుద్ధావతారం, మీ కూర్మావతారం ఇద్దరిని ఓ చోట పెడితే ఎలా వుంటుందంటావు?........నిజంగా అలాంటివాళ్ళు ఇద్దరూ మొగుడు పెళ్లాలయితే ఆ యిల్లు ఎలా వుంటుందంటావు !?" నవ్వుతూ కొంటెగా అంది మీనాక్షి!

"ఇంకెలా వుంటుంది, వాళ్ళతోపాటు ఇల్లూ నిద్రపోతుంది, నా జోక్‌కి నేనే నవ్వాను" గట్టిగా....మీనాక్షి గట్టిగా నవ్వింది 'కరెక్టుబావా!' అంటూ.

క్రిందనించి రామావతారం, శాంతి మావైపు చూస్తున్నారు. మేం నవ్వుతున్నామని తెల్సినా, కారణం తెలియదు, వినపడదు........రమ్మని చేయి ఊపాడు రామావతారం........క్రిందికి దిగివెళ్లాం. కొబ్బరిబొండాలు కొంటున్నాడు రామావతారం.

చల్లని కొబ్బరిబొండాలలో నీళ్ళుత్రాగాక ప్రాణం కుదుటబడిందని పించింది.... కెమెరాతీసి రకరకాల పోజుల్లో ఏనుగుల శిల్పాలదగ్గిర, రథ చక్రాల దగ్గిర అందరిని నిలబెట్టి ఫోటోలు తీశాను.

బయటికివెళ్ళి ఎదురుగా సర్వీచెట్లమధ్య ఇసుకలో కూర్చుని తెచ్చు కున్న ఫలహారాలు తిని కాఫీలు త్రాగాం.

అక్కడ రాత్రి వుండదల్చినవారికి గెస్టుహౌస్ వుంది. అక్కడ వుండి చేసేదేమీలేదని రాత్రికివుండే ప్రోగ్రాం పెట్టుకోలేదు........ఇంక అక్కడ చూడవల్సిన మ్యూజియం ఒకటీ చూసేసి ఏడుగంటలకి ఇల్లు చేరాం.

* * *

తరువాత మా ప్రోగ్రాం గోపాల్‌పూరు! గోపాల్‌పూర్ దూరం కాబట్టి ఒకరోజులో వెళ్ళిరావడం కుదరదని మూడురోజులు ప్రోగ్రాం వేశాను ఒకరోజు వెళ్ళడం అక్కడొక రోజుండడం మూడోరోజు బయలుదేరి రావడం.

గోపాల్‌పూరులో సముద్రంతప్ప అక్కడ యింక చూసేందుకు ఏమీలేవు! అక్కడికి వెళ్ళేవారు సాధారణంగా సముద్రంలో స్విమ్మింగ్‌కి వెళతారు, గోపాల్‌పూరులో బీచి ఒడ్డున ప్రసిద్ధిచెందిన "ఓబ్‌రాయ్" హోటలువుంది. విదేశీపద్ధతులలో, ఆధునికంగా కట్టబడిన హోటలు అది! ఆ ఖరీదులు సామాన్యులకి అందుబాటులో వుండని కారణంగా సాధార ణంగా అక్కడికి వచ్చేవారు మరీడబ్బున్నవాళ్ళు, విదేశీయులే ఐ వుంటారు. పూరీలాగే హోటలులో, బీచిలో, అందరూ విదేశీయులే వుంటారు. ముఖ్యంగా సమ్మర్‌కి, క్రిస్మస్ సెలవలకి హోటలు నిండుగా ఉంటుంది....

హోటలుముందు కుర్చీలు వేసుకు కూర్చుంటే సముద్రం ఒడ్డున కూర్చున్నట్టే వుంటుంది.

నా ప్రోగ్రాంవిని శాంతి "ఓబ్‌రాయ్ హోటలు చాలా కాస్ట్లీకాదూ!" అంది.

నా వళ్లు మండింది... తీక్షణంగా చూశాను. "అవుతే అవుతుంది, రోజూ ఖర్చుపెడతామా ఏమిటి? ఎప్పుడూ డబ్బుడబ్బు ఓ సరదాలేదు పాడు లేదు" అవసరమైన దానికంటె నా గొంతు అంత కర్కశంగా మారడానికి కారణం ఇన్నాళ్లుగా శాంతిపట్ల నావిరక్తి కారణం....సందు దొరగ్గానే కసి తీర్చుకున్నాను........

శాంతిమొహం నల్లబడింది. "అందుకు అనలేదు" అదురుతున్న.. పెదాలతో మెల్లిగాఅంది. పరిస్థితి గుర్తించి రామావతారం శాంతిని సపోర్ట్ చేస్తూ మాట్లాడడానికి ప్రయత్నించాడు............ "-వునండీ, రోజుకి ఏ నలభయ్యో అనవసరంగా ఎందుకు ఖర్చు? అందులో రెండు రూములు కావాలి మనకు, రోజుకి ఓ వంద అంటే చాలా ఎక్కువ! ఇంతాచేస్తే అక్కడ సముద్రంతప్ప మరేం లేదంటున్నారు........ పూరీ చూశాంగా" అన్నాడు.

"మరేం పరవాలేదు, అవనీండి. రోజూ మీరు రారు, రోజూ ఖర్చుపెట్టం....అన్నీ చూడ్డానికి కాకపోతే మరెందుకు వచ్చారు మీరు. ." శాంతి వంక కఠినంగాచూస్తూ అన్నాను....

శాంతి తలవంచుకు లోపలికి వెళ్ళిపోయింది. మలినమైన ఆమె ముఖంచూస్తే అంత దురుసుగా మాట్లాడకపోవలసిందేమో అనిపించింది.

గోపాల్‌పూరు వెళ్ళినరోజు మధ్యాహ్నం, ఆ మర్నాడు అంతా.... నేను మీనాక్షి ఎక్కువభాగం సముద్రంలోనే గడిపాం.

సముద్రం ఒడ్డున కుర్చీలు వేసుకొని రామావతారం, శాంతి పుస్తకాలో, ట్రాన్సిస్టరో పట్టుకుని కూర్చునేవారు. వాళ్ళ పర్యవేక్షణలో పిల్లలు దగ్గిరిగా నీళ్ళల్లో ఆడుతూండేవారు.

నేను మీ సాక్షిమాత్రం స్విమ్మింగ్ నెపంతో దూరంగా ఈదుకుంటూ వెళ్ళిపోయి, దూరంగా నిర్జనమైన ఒడ్డున అలా కూర్చుని గంటలు గంటలు గడిపేసేవారం.

ఆ రెండురోజుల్లో మీనాక్షి నాకు మరింత సన్నిహితంగా వచ్చినట్ట నిపించింది...... ....అలా ఆమెనిచూస్తూ, ఏదో పిచ్చిపిచ్చిగా మాట్లాడు తూంటే....ఇన్నేళ్ళ నా వైవాహిక జీవితంలో లభ్యమవని తృప్తి ఆనందం ఇన్నాళ్ళకి ఆ రెండురోజుల్లోనే లభ్యమయినట్లు అనిపించింది! మా మాట లకి అర్థం వుండేదికాదు! మీనాక్షి ఏదోచెప్పేది, నేను పరధ్యానంగావింటూ ఊకొడ్తూ....ఆమెని కళ్ళతో త్రాగేసేవాడిని అంతే!....అంతకంటె చొరవ చేసే సాహసం చెయ్యలేకపోయాను! నా ఊహలెంత సేపూ.... ....మీనాక్షిని పెళ్ళాడివుంటే?....అన్నచోటే కేంద్రీకృతమయ్యేవి ఎంత సేపూ!.... .... అలా ఆలోచించడం, అలా పరస్త్రీని చూడడం వగైరాలు తప్పని, నా భార్యకి ద్రోహంచేస్తున్నానన్న ఆలోచనలుగాని ఆ క్షణాలలో నాకెప్పుడూ రాలేదు....మరి....మీనాక్షి మనసులో ఏ భావాలుండేవో నాకు తెలియదు! నామీద ఇష్టం వున్నట్టు పబ్లిగ్గానే ప్రకటించింది....నన్ను పెళ్లాడుదామన్న ఊహ వున్నట్టు స్ఫురించింది మాటల్లో. సరే అప్పటి ఊహల్లో! ఇప్పటి మాట? యిప్పుడూ ఇంకా నన్ను పెళ్లాడనందుకు పశ్చాత్తాపపడుతూందా? ఆమె భర్తతో ఆమె సంతృప్తిపడలేకపోతూందా .... నాలాగే ఆమె ఆలో చిస్తూందా? మీనాక్షి మాటలు, చేతలు, చూపులు నన్ను కవ్విస్తూండేవి. అది కవ్వింపా? మీనాక్షి స్వభావసిద్ధమైన చేతలో తేల్చుకోలేక పోయేవాడిని. మీనాక్షితో వున్నంత సేపూ ఇసకలో నా దగ్గిరగా అంటీఅంటనట్టు తాకుతూ కూర్చునేది, ఏదో చెపుతూ చెపుతూ నా కాలిమీద చెయ్యివేసేది, ఇంకా సరసం పాలెక్కువ అయితే నా బుగ్గలు గిల్లేది, ముక్కుపట్టుకు లాగేది, కితకితలు పెట్టేది, నా చేతిలో చేయిదూర్చి యిటూ అటూ వూగిస్తూ మాట్లాడేది....వీటన్నింటి దృష్ట్యా మీనాక్షి మనసులో ఏం వుందో, ఏం కోరుతుందో తెలుసుకోవాలని అనేక విధాల ప్రయత్నించేవాడిని, ఇది కేవ లం మీనాక్షి అలవాటేమో, మొగవాళ్ళతో యింత చేరువుగావడం ఇలా మాట్లాడటం వగైరాలు పాశ్చాత్యదేశం అలవాట్లు అవడంవల్ల అలా

చేస్తుందేమో అనిపించింది! మీనాక్షి మనసులో ఇంకో ఆలోచన లేకపోతే నేను ఏదన్నా కాస్త చొరవచేస్తే ఫలవుతుందేమో! ఎంతయినా వివాహిత స్త్రీ....భారత స్త్రీ సంస్కృతి ఎంతయినా కొంతకాకపోతే కొంతయినా మీనాక్షిలోనూ మిగిలి వుండాలి. ఇద్దరు పిల్లల తల్లి, పదేళ్ళ వైవాహిక జీవితం గడిపిన ఆడది....మరో పరాయిమొగాడి పొందు కోరుతుందా.... మీనాక్షితో వున్నంతసేపూ ఈ ప్రశ్నలు పుట్టేవి! వీటికి జవాబు చెప్పు కోడంతోనే ఆ కాస్త ధైర్యము హరించుకుపోయేది!

అసలు చెప్పాలంటే అన్నిటికంటె ముఖ్యకారణం పిరికితనం! మీనాక్షికి ఆ ఉద్దేశం లేకపోతే ఏమిటుంటుందోనన్న ఆలోచన ఓప్రక్క, ఇంకోవైపు రామావతారానికి, శాంతికి తెలిస్తే మా బ్రతుకులు ఏమవుతాయి అన్న పిరికితనం, భయమే, ఉరకలువేసే నా మనసుని వెనక్కిలాగేది! మొత్తంమీద ఏ కారణమవుగాక .... మీనాక్షి నేను హద్దులు మీరకుండా కాలక్షేపం చేశాం!

తరువాత హీరాకుడ్ డామ్ చూడ్డానికి వెళ్ళినపుడుగాని, రూర్కెల్లా వెళ్ళినపుడుగాని....మీనాక్షి తను ఏకాంతంగా గడిపే సమయం లభ్యమవ లేదు.....హీరాకుడ్ డామ్‌చూడ్డానికి వెళ్ళి జవహర్ మీనార్ దగ్గర అశోక నివాస్ గెస్టు హౌస్‌లో బసచేశాం. గెస్టుహౌస్ చాలా అందంగా ఎత్తయిన కొండమీద కట్టారు. నెహ్రూగారి డామ్ పూర్తయ్యాక "ఇనాగ్రేట్" చేయడానికి వచ్చినపుడు ప్రత్యేకం ఆయనుండడానికి రాత్రి పగలు పనిచేసి ఆయన వచ్చేటప్పటికి ఆవిడిది తయారు చేశారు చాలా ఖర్చు పెట్టి! కొండమీద అక్కడనుంచి చూస్తే డామ్ బుర్లా, హీరాకుడ్ కని పిస్తాయి. డామ్‌కి ఒకప్రక్క వుండేవూరు హీరాకుడ్ అని, ఇంకొ చివర వుండే వూరు 'బుర్లా' అని అంటారు. డామ్ కట్టేటప్పుడు ఆ కాలవ అంతా చాలా బాగుండేది. తమిళులు, పంజాబీలు, తెలుగువారు కాస్మా పాలిటన్‌గా వుండేది. డామ్ పూర్తయ్యాక రాష్ట్రప్రభుత్వం కిందకి వచ్చాక యిప్పుడు పూర్తిగా ఒరియావారు మాత్రం వుంటున్నారు. బిల్డిం గులు చాలా ఖాళీగా వున్నాయని బుర్లా ఇంజనీరింగు కాలేజీ, మెడికల్

కాలేజీ కట్టారు. హీరాకుడ్‌లో అల్యూమినియం ఫ్యాక్టరీ, కేబుల్స్ ఫ్యాక్టరీ మొదలైనవి పెట్టారు.

డామ్ చూడడానికి పర్మిషన్ తీసుకొని కారులో డామ్ అంతా చూపించాను. హీరాకుడ్ ప్రపంచంలో చాలా పొడవయిన డామ్. డామ్ పైన రేలింగ్ పట్టుకుని క్రింద 'స్విల్‌లిక్స్' చూస్తుంటే ఎత్తునుంచి క్రిందికి దుమికే ఆ నీటి వేగానికి కళ్ళు తిరుగుతాయి. రాత్రి అయితే డామ్ పొడుగునా లైట్లు బారుగా అందంగా కనిపిస్తాయి. క్రిందికి వెళ్ళి పవర్ హౌస్ అంతా కూడా చూపించాను.

అలా పైనుంచి రొదచేస్తూ దుమికే ఆ నీటి వేగాన్ని మరికాస్త దూరంలో అంత వేగం ఏమయిపోయిందో .... ఏం తెలీనట్టు నెమ్మదిగా నిర్మలంగా కాలవద్వారా వెళ్ళిపోతున్న ఆ మహా నదిని! చూస్తుంటే.... శాంతిపోలికలు కనిపించాయి. ఆ దృశ్యంలో : ఉరకలు, పరుగులతో, రొదతో దుమికే జలపాతం మీనాక్షి ! నిండుగా, నిర్మలంగా పారేనది శాంతి ! రెంటిలో వుండేది నీరే. కాని స్వరూపాలకి ఎంత భేదం? మీనాక్షి స్త్రీ. శాంతి స్త్రీ. కానీ .... ఇద్దరికీ ఇంత తేడా ? నా కెందుకో ఆ ఎగురుతూ, దుమికే జలపాతమే నచ్చింది.....అవును అలా కాలవ వెంట నెమ్మదిగా పారే నీటిలో ఏం ప్రత్యేకం వుందని ఎవరన్నా అటు చూస్తారు. డామ్ చూడ్డానికి వచ్చే ఎవరినన్నా ఆకర్షించేది ఆ ఎత్తునించి ప్రచండ వేగంతో ఉరకలు వేసే నీరే .... కాని కాలువకాదు! ....బుర్లాలో వున్న ఒక్క రోజు డామ్ చూడ్డానికి, తెలిసిన మిత్రులనీ చూడ్డానికి సాయంత్రం "చిప్లిమా" అనే చోట కట్టిన పవర్ హౌస్ చూడ్డంతో సరి పోయింది. మీనాక్షికి నాకు ఏకాంతంగా గడిపే అవకాశమే లేదు అక్కడ....

తరువాత రూర్కెలాలో అసలు వీలు కుదరలేదు .... రూర్కెలాలో "స్టీల్ ప్లేంట్" చూడాలన్న కోర్కెకంటె కూడా .... మా పిన్ని కూతురుని (మీనాక్షికి అత్తకూతురు అన్న మాట!) .... చూడాలన్న కోర్కె ఎక్కువయింది.... చాలా రోజులకి కలుసుకున్న మా అందరిని

చూసి విశాల సంబరపడిపోయింది. స్టీల్ ప్లేంట్‌లో దాని మొగుడు ఇంజ నీరు.... వెయ్యి రూపాయల జీతం. క్వార్టర్స్, ఇద్దరు పిల్లలు అన్నీ బాగానే వున్నాయి. పాపం అతను ఓ రెండు రోజులు సెలవు పెట్టి అన్నీ త్రిప్పి తీసుకొచ్చాడు మమ్మల్ని. మా కోసం మహా ఆర్భాటంగా ఏర్పా టులు చేసింది విశాల! అక్కడున్న రెండు రోజులు తినడం. తిరగడం. రాత్రి ఒంటి గంటవరకు కబుర్లు చెప్పుకోడంతో సమయం చాలక అను కున్నదానికంటే మరో రోజు వుండిపోయాం.

రూర్కెలా ఒరిస్సాలో పెద్దదయిన వూళ్ళల్లో ఒకటి! ఒకటేమిటి ముఖ్యమైంది అని చెప్పాలి. ఎంచేత అంటే ఆవడానికి కటక్, సంబల్‌పూర్, బరంపురం వూళ్లు పెద్దవయినా నీట్‌గా, అందంగా, చక్కనిరోడ్లు అవి వున్న ఒరిస్సాలోవూళ్లు రెండే రెండున్నాయి, ఒకటి రూర్కెలా రెండుభువ నేశ్వర్, భువనేశ్వర్ రోడ్డు బంగళాలుతప్ప లైఫ్ లేదు. రూర్కెలా అలా కాదు, కాస్మాపాలిట్' ప్లేసు కాబట్టి చాలా సందడిగా వుంటుంది. మంచి సినిమాలు, ప్రత్యేకం "ఆంధ్రా అసోసియేషన్" వగైరాలున్నాయి ....కాల క్షేపానికి లోటుండదు. ఎన్నాళ్ళ నుంచో నేనూ శాంతి వెడదాం అనుకుం టూనే అశ్రద్ధ చేశాం. ఆ కోరికే ఇన్నాళ్ళకి తీరింది. మీనాక్షి ధర్మమా అని.

రూర్కెలా నుంచి వచ్చాక ఇంచు మించు అందరం డీలాపడి పోయాం. పదిహేనురోజులయి తిరిగిన వాళ్ళం తిరుగుతూనే వున్నాం టూరిస్టుల్లాగ. వేళకి తిండి నిద్రలేక తిరుగడంతో అందరం మొహాలు వేళ్ళాదేశాం.

"యింక నే నెక్కడికి రాను బాబోయ్" అనేశాడు రామావతారం.

"అన్నట్టు బావా, ఖండగిరి, ఉదయగిరి చూపించలేదు అంది మీనాక్షి."

"నీ ఓపిక్కి మెచ్చుకోవాలి. యింకా తిరగ్గలమనే వుద్దేశం" రామావతారం అన్నాడు.

"అవే కాదండోయ్. మర్చిపోయాను మీకు ఓపిక వుంటే యింకా మాచ్ ఖండ్, చిత్రకాట్" వాటర్ ఫాల్స్ వున్నాయి.... అఫ్‌కోర్స్ చాలా దూరం. కోరాపుట్ డిస్ట్రిక్ట్‌లో వున్నాయి....

"వద్దు బాబూ చాలు ఇంకెక్కడికి రాలేను....మీకో నమస్కారం" నమస్కారం పెట్టేశాడు.

"పోనీ అవి వద్దు దూరం అంటున్నావు. "నయాగరా" అవి ఎలాగు చూశాం. ప్రక్కనున్న ఖండగిరి, ఉదయగిరి చూపించేయిచాలు." అంది మీనాక్షి.

"ఓ దానిదేముంది. కాస్త రెస్టు తీసుకున్నాక ఓపూట వెళ్లొచ్చు"

ఓరోజు రెస్టు తీసుకున్నాక ఆ వూర్లో కూడా చూడాల్సిన "లింగరాజ్" ఆలయం మ్యూజియం వగైరాలు చూపించాను. లింగరాజ్ ఆలయం పూరీ దేవాలయంకంటె చాలా పురాతనమైంది. ఇండియాలో దేవాలయాలన్నిటికంటె ఎత్తయిన శిఖరం గలదిట. దేవాలయంలో ఈశ్వరుడి లింగం భూమిలోవుండి కాస్తమాత్రం పైకి కనిపిస్తూ వుంటుంది. చరిత్ర ప్రసిద్ధమైన ఆలయమే. ఇంకా అక్కడున్న రాజారాణి టెంపుల్‌కి కూడా తీసికెళ్లాను.....ఒరిస్సాలో దేవాలయా లన్నింటి స్ట్రిక్చర్ ఒకలాగేవుండి వైవిధ్యం కనపడదు.

మరో పూట మ్యూజియం చూపించాను. భువనేశ్వర్‌లో కంటికి అహ్లాదకరంగా ప్రతి బిల్డింగ్ మీదా రంగురంగుల "బోరన్ విల్లాలు" రగబూసిన పూలతో అందంగా కనిపిస్తాయి.... మ్యూజియంలో ఆ పూల మొక్కలమ్మీ కలర్ ఫోటోలు తీస్తే అద్భుతంగా వస్తాయి. మ్యూజియంలో ముఖ్యంగా చూడవల్సినవి ఒరిస్సా ఆర్ట్—క్రాఫ్ట్స్! హాలులో ప్రవేశించగానే ఎదురుగా కోయవాళ్ళ చేతులు నడుంచుట్టు కలిపి చేసే డాన్సు కనిపిస్తుంది. ఆ దృశ్యం గాజు కేసులో కనక బంధించక పోతే నిజంగానే అక్కడ కోయవాళ్ళు—డాన్స్ చేస్తున్నా రనిపిస్తుంది. మట్టితో మలచిన లైఫ్ సైజు బొమ్మలకి విగ్గులు, బట్టలు, ఆభరణాలు అన్నీ పెట్టి తయారుచేసిన ఆ ప్రతిమలకి ప్రతి వంపు సొంపు చిన్న చిన్న డిటైల్స్‌తోసహా మనుష్యులే అక్కడ నిలబడ్డారా అన్న భ్రమకలిగిస్తాయి.

ఒరిస్సా మట్టితో చేసే బొమ్మలకి ప్రసిద్ధి. నవరాత్రి ఉత్సవాలలో ముఖ్యంగా కటక్‌లో దేవీ విగ్రహాలు అద్భుతంగా మలుస్తారు. చూసితీరాలి! ఓ సారి దుర్గా పాదాల దగ్గిర కూర్చొన్న బొమ్మ "బొమ్మని ముట్టుకుచూస్తేనేగాని ఎవరూ నమ్మలేనంత సహజంగా ఒంటి ముడతలతో, నరాలతో ముసలి మనిషినే కూర్చుండబెట్టినంత సహజంగా కేవలం మట్టితో మలచిన ఆ శిల్పులని అభినందించకుండా ఉండలేరు ఎవరూ.

మరోపూట మా ఐ. ఎ. ఎస్. మిత్రులందరి ఇళ్ళకి తీసికెళ్ళాను ఒక ఆదివారం ఇంగ్లీషు సినిమా మార్నింగ్‌షోకి వెళ్లాం! రామావతారం విదేశాలలోతీసిన ఫోటోలన్నీ "స్లైడ్ ప్రొజెక్టర్"తో చూపించాడు.

ఇరవై రోజులు ఇరవై నిమిషాలలాగ తెలియకుండానే గడిచి పోయాయి. ఆరాత్రి మీనాక్షివాళ్ళు వెళ్లేరోజు! టిక్కట్లు హౌరామెయిల్‌కు ముందే బుక్ చేయించాను.

మీనాక్షి వెళ్ళిపోతుందంటే ఉదయంనించి ఏదోగుబులుగావుంది.... మీనాక్షి వెళ్ళిపోతుంది!....తరువాత ఏముంది? మళ్ళీ నా ఆఫీసు....రాతి బొమ్మలా చైతన్యంలేని శాంతి,....నా కెందుకో దిగులనిపించింది. మీనాక్షి వచ్చింది. వెళ్ళిపోతుంది! ఏదో అసంతృప్తి....ఏదో వెలితి! మీనాక్షి వెళ్ళిపోతుంది.... మళ్ళీ ఎన్నాళ్ళకో .... బహుశా అసలు కల్సుకోలేక పోవచ్చు. ఈ ఇరవై రోజులు గుర్తుగా, మీనాక్షి రాకకి గుర్తుగా నాకేం మిగులుతుంది! ఎంత ఫూల్‌వి! అంత అద్భుతమైన అవకాశాలు చేతులారా విడిచేశాను....చెంతకి వచ్చిన ఆనందాన్ని అందాన్ని అనుభవించటంచేతగాని చవటవి! ఛీ....ఉత్త స్టుపిడ్‌లా బిహేవ్ చేశాను. మీనాక్షి ఏమనుకుందో! నా అప్రయోజకత్వానికి నవ్వుకుందేమో అంతలా చేరువకి వచ్చిన ఆడ దాన్ని సంతృప్తి పరచలేని చవటని..... ఆ ఉదయం అంతా ఏదో చేతు లార అందినదాన్ని జారవిడిచానన్న భావం నన్ను దిగాలుపరిచింది.... ఏదో జరగవలసింది జరగనీయలేదు నేను. అన్న అసంతృప్తి నన్ను క్రుంగదీసింది....

వెళ్ళేలోపల మీనాక్షిని ఏకాంతంగా ఒక్కసారికలుసుకు తీరాలి.... కాని ఎలా? ఎక్కడ ?.... ఎలా వీలవుతుంది ?

నా ఆలోచన మీనాక్షికే వచ్చిందో, లేక మామూలుగానేఅందోగాని, ఆ మధ్యాహ్నం రెండుగంటలప్పుడు ...."బావా! ఆఖరికి ఖండగిరి ఉదయగిరి చూపించనేలేదు. నేనూ మర్చిపోయాను" అంది. నా మనస్సు ఉరికింది ఒక్కసారిగా.

"అవునవును. మర్చిపోయాను. మధ్యాహ్నం వెడదాం మూడు గంటలకి ఎంత సేపు ప్రక్కనేగా...."

"నే రాలేనండీ. ఎక్కలేను. కాలింకా నొప్పిగానే వుంది. మీరంతా వెళ్ళండి" అన్నాడు రామావతారం. క్రితం రోజు మ్యూజియం మేడమీది నుంచి దిగివస్తూంటే అతని కాలు మడతపడి పాదం వాచింది. అయిడన్స్ రాచుకుని కాపడం పెట్టినా యింకా తగ్గలేదు. నా మనస్సులో ఆలోచన గ్రహించినట్టే రామావతారం అలా అనడం నిజంగా సంతోషం అనిపించింది! ప్రశ్నార్థకంగా శాంతివంక చూశాను .... "శాంతీ రానంటే బాగుండును" అన్న ఆలోచన నా మొహంమీదే కన్పించిందేమో నా వంక ఒక్క క్షణం చూసి నేనూ రాను.........ఎన్ని సార్లో వెళ్ళాను.... పెద్ద చూడ్డానికి ఏముంది మీరు పిల్లలు వెళ్ళండి. అంది శాంతి ఎటోచూస్తూ.... మనసులోనే థ్యాంక్స్ చెప్పుకున్నాను.

మూడు గంటలకి మీనాక్షి తయారయింది. "వెళ్ళిపోతాను, మా వూరు వెడితే నాకు మళ్ళీ బద్ధకం" అంటూ ఉదయం చక్కగా ఓ గంట అభ్యంగ స్నానం ఆడింది.

జుట్టు ఆరలేదని వదులుగా వాలుజడ వేసుకొంది. ఉదయమే శాంతి బొట్టుపెట్టి నే కొన్న సంబల్‌పూర్ చీర యిచ్చింది మీనాక్షికి. ఒరిస్సాకి వచ్చినందుకు గుర్తుగా ఇంకా ఎన్ని రకాల చీరలువున్నా కావాలని "సంబల్‌పూర్" చీర నూటముప్పైరూపాయిలుపెట్టి కొన్నాం. శాంతి నేను మీనాక్షి రాకముందే! సంపెంగ రంగు చీరకి ఎఱ్ఱటి బోర్డరు

చీర చాలా బావుంది. మీనాక్షి కట్టుకుంటె చీరకి అందం వచ్చిందో, చీరనించి మీనాక్షికి అందం వచ్చిందో చెప్పలేనుగాని, ఆ చీరతో, ఎర్ర జాకట్టుతో తలలో గార్డెనులో విరిసిన చామంతులు, కనకాంబరాలు, మరువంకలిసి కట్టిన మాల, కళ్ళకి కాటుకతో ఆరోజు సింపుల్‌గా అద్భుతంగా కనిపించింది మీనాక్షి.

ఆ రోజు వేసుకున్న ముడులు లిప్‌స్టిక్‌లు, స్లీవ్‌లెస్‌లు మానేస్తేనే ఇవాళ్ళ నేచురల్‌గా చాలా అందంగా పాత మీనాక్షిగుర్తు వచ్చేట్టుంది.

శ్రద్ధగా క్రికెట్ మాచ్ ఆడుతున్న పిల్లల్ని ఎంత పిలిచినా రామన్నారు, "వుయ్ ఆర్ నాట్ ఇంటరెస్టెడ్.... యు గో మమ్మి" అంటూ మీనాక్షి పిల్లలు రామని అల్లరి పెట్టారు, క్రికెట్ ఆడుకోవాలని.

"సరే మీరిద్దరూవెళ్ళి వచ్చేయండి త్వరగా.....మీనా ఇంకా పేకింగ్ అది వుంది. అక్కడుండిపోక త్వరగా రండి" అంటూ హెచ్చరించి మమ్మల్ని వెళ్ళమన్నాడు. రామావతారం.

మీనాక్షితో ఒంటరిగా వుండే చివరి అవకాశం లభ్యమయినందుకు పొంగిపోయాను. యీసారి యీ అవకాశాన్ని యిదివరకు ఫూల్‌లా జార విడవవద్దని మనస్సు గట్టిగా హెచ్చరించింది.....

నాలుగు మైళ్ళలోవున్న ఖండగిరి, ఉదయగిరి గుహలు పది నిమిషాలలో చేరాం. పేర్లు చూస్తే గుహలని పెద్ద గొప్పగా అనడం గానీ నిజానికి అక్కడ కొండలలో తొల్చిన చిన్న చిన్న గుహలలాంటివి కొన్ని వుంటాయి. యిటు ప్రక్క కొండని ఖండగిరి, అటుప్రక్కకొండని ఉదయగిరి అంటారు,.... చిన్న చిన్న రాతి విగ్రహాలు చెక్కిన గుహలు చూసిందో ఊహించుకుని వారందరూ అవి చూడగానే అనవసరంగా ఇన్ని మెట్లెక్కి వచ్చాం. ఏం లేదు. చూడానికి అనుకోకుండా వుండలేరు.... ఖండగిరిలో ఓ చిన్న దేవాలయం వుంది. దాన్లో దేవుడిపేరు గోమతేశ్వరుడో, ఏదో గుర్తులేదుగాని నల్లరాయితో చేసిన రెండు మూడు పిలువుల నగ్న విగ్రహం వుంటుంది....పిల్లలు లేనివారు ఆ నగ్నమూర్తిని

దర్శించుకుని ప్రక్క ఖాళీ ప్రదేశంలో ఎంతమంది పిల్లలు కావాలో అన్ని చిన్న రాళ్ళు గుట్టలమీద పెట్టుకుంటారు. అలా అక్కడ పోగయిన రాళ్ళని చూస్తే ప్రపంచ జనాభా యింతలా పెరిగిపోతుంది.... యింత మంది పిల్లలు లేనివారున్నారా అనిపిస్తుంది.

"ఇంతేనా బావా.... ఖండగిరి ఉదయగిరి అంటే ఏమిటో అనుకున్నాను." అంది మీనాక్షి అంతా చూడ్డం అయ్యాక.

"చెప్పాగా పెద్దగా చూటడానికి ఏమీ లేదని. పద. అలా వెళ్ళి కాసేపు కూర్చొని వెడదాం. అన్నాను....దూరంగా ఎవరూలేనిచోట చెట్ల నీడన ఒక రాయిమీద కొండరాయిని అనుకుని ఇద్దరం ప్రక్క ప్రక్కన కూర్చున్నాం.

కొంత సేపు ఇద్దరం మాటలు కరువయినట్లు అలా కూర్చున్నాం. ...."మీనాక్షీ" అదోలా ధ్వనించింది. నా గొంతు. మీనాక్షితో ఏదో చెప్పాలని ఆరాటంగావుంది. మీనాక్షితో గడిపిన ఈ రోజులు ఎంత ఆనందాన్నిచ్చాయో తను వెళ్ళిపోతూంటే ఎంత బాధగావుందో....ఏదేదో చెప్పాలని ఏదో చెయ్యాలన్న ఆరాటంతో నా మాట తడబడింది.....మీనాక్షి నావైపు తిరిగి నా మొహం చూసింది. "బావా....ఈ ఇరవై రోజులు చాలా త్వరగా గడిచిపోయాయిగదూ. ఇంత ఆనందంగా నేనెప్పుడూ గడపలేదు బావా ....వెళ్ళిపోవాలంటే ఏదో బాధగావుంది....ఏదో కలలా అయిపోయాయి రోజులు. వ్చ్ మళ్ళీ ఏముంది. ఆ గందరగోళం సిటీ. రోజంతా ఆఫీసులోనేవుండి ఆయనవున్న కాసేపైనా ఏ సరదా లేకుండా నిర్లిప్తంగావుండే ఆయన; కాలక్షేపం లేక దొర్లే నేను....మళ్ళీ మామూలే. బావా నిజం చెపుతున్నాను.... ఐ హేట్ దట్ లైఫ్...." బేలగా అంది మీనాక్షి. నేను చెపుదామనుకున్నా మాటలన్నీ మీనాక్షే అనేసింది.

"అవును మీనాక్షి....ప్రొద్దుట నించీ నీవు వెళ్ళిపోతానంటే ఏదోలా వుంది .... నీవన్నట్టు మళ్ళీ ఆఫీసు. ఇల్లు రొటీన్ లైఫ్ ఈ ఇరవై రోజులు ఎంజాయ్ చేసినంతగా ఎప్పుడూ నేను ఎంజాయ్ చేయలేదు

నేను నా లైఫ్‌లో. ఆఖరికి శాంతితో "హనీమూన్‌కి" వెళ్ళినప్పుడుకూడా ....అంతకంటె ఇంకా ఎలా చెప్పాలో అర్థం కాలేదు నాకు."

అలా ఇద్దరం మూగగా ఆలోచిస్తూ కూర్చున్నాం. ఇద్దరి హృదయాలు బరువుగా వున్నాయి!! మీనాక్షి కాస్సేపు అలా వుండి ఎందుకో నిట్టూర్పు విడిచింది.

"వెళ్ళి పోదామా బావా ఇంక!" అంది.

"అప్పుడేనా. వుండు....వుండు...." కలవరంగా అన్నాను.... ఎన్నో చెప్దామని తీసుకొచ్చాను. మీనాక్షితో ఏకాంతంకోసం కలవరించాను .... ఆ ఏకాంతం దొరికినా ఏం చెప్పలేకపోతున్నాను. "వుండు మీనా ....ఎలాగా వెళ్ళిపోతావు .... ఇంక కొన్ని గంటలేగ మనం కలిసి వుండడం....తరువాత మళ్ళీ ఎన్నాళ్ళకో. అసలు కలుసుకోగలమో లేదో ....మీనాక్షి చేయి చేతిలోకి తీసుకొని వణుకుతున్న గొంతుతో అన్నాను.

మీనాక్షి ఆశ్చర్యంగా నా మొహంలోకిచూస్తూ అస్పష్టంగా "బావా!" అంది. "మీనా" అని పిలవడం నా జీవితంలో అదే మొదటిసారి! అంతే కాక నా అంతట నేను మీనాక్షి చెయ్యిపట్టుకోడం అదే మొదటిసారి. అందుకే మీనాక్షి ఆశ్చర్యపోయింది.

"మీనా!" ఆవేశంగా మీనాక్షి చేయి నొక్కాను.

"ఏమిటి బావా, క్రొత్తగావున్నాయే నీమాటలు చేతలు యివాళ!" చిన్నగా నవ్వుతూ అంది మీనాక్షి నా చేయి ఎడంచేత్తో నిమురుతూ.

"అవును మీనా. ఇన్నాళ్ళు ఫూల్‌లాగ ప్రవర్తించాను....కదూ!" మీనాక్షికి నేనన్నది అర్థంకానట్లు ప్రశ్నార్థకంగా చూసింది. "అవును మీనా ఆఖరిసారిగా లభ్యమయిన యీ అవకాశాన్ని జారవిడుచుకో మంటావా?" నా వళ్ళు అప్పటికే వశం తప్పింది .... నా కళ్ళు మత్తెక్కడం ఆరంభించాయి....మీనాక్షి నావైపే చూస్తూంది....ఆమె కళ్ళు నా కళ్ళల్లో దేని కోసమో వెతుకుతున్నాయి.

"మీనా....ఐలైక్ యూ!....ఐ లవ్ యూ! మీనా!" గుండెలదురుతూండగా వణుకుతున్న గొంతుతో అని మీనాక్షి నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గిరికి లాక్కుంటూ ముద్దుపెట్టుకోబోయాను....మీనాక్షి వెలవెలపోతూ చూసింది. వివశురాలైనట్టు ఒక్కక్షణం కళ్ళుమూసుకుంది.... చిన్న నిట్టూర్పువిడిచి ముద్దు పెట్టుకునే సమయానికి మొహం త్రిప్పేసింది.... సున్నితంగా నా మొహం ప్రక్కకి త్రిప్పేసింది....

"వద్దుబావా!....వద్దు.... ఎందుకీ క్షణిక సుఖానికి, ప్రలోభానికి లొంగిపోయి .... తరువాత అంతా ఏదో తప్పుచేసినట్టు మనం గిల్టీగా ఫీలవ్వాలి! నీకు శాంతి. నాకు భర్త ఇవి రెండూ రెండునిజాలు. మనం మన ఇద్దరికి అన్నది అబద్ధం! ఈ రోజు కల! రేపు నిజం! మనం జీవితాంతం గడపవలసింది వాళ్ళతో. ఆ మాత్రందానికి. ఈ ఒక్క క్షణం కోసం, ఈ అల్పసంతోషం చేయకూడని పని చేశామని మనవాళ్ళకి ద్రోహం చేశామని మనం బాధపడడం ఇదంతా ఎందుకు బావా! ఈ ఒక్క క్షణంతో మనకు ఒరిగేదేమీ వుండదు, గిల్టీకాన్షన్‌తప్ప...." మీనాక్షి కళ్ళల్లో దైన్యం ద్యోతకమవుతున్నా మాట స్థిరంగా వుంది.

నేను వెర్రివాడిలా "మీనా!" అంటూ చూశాను....మీనాక్షి మాటలు విన్నాక అప్రయత్నంగా కలలోంచి మెలకువ వచ్చినట్లయింది! నిజం చెళ్ళుమని చెంపమీద కొట్టినట్టు అయింది. ఆవేశం ఒక్కసారిగా దిగిజారిపోయింది. మీనాక్షి పరాయిది! నేను మీనాక్షికి పరాయివాడిని! ఇంక కొన్ని గంటల్లో వెళ్ళిపోయే మీనాక్షినించి నేనే మాశించినా ఆ ఆనందం క్షణికం! తరువాత అది పాతభీతిగా మారి ఆ నీడ రోజు రోజుకి పెరిగి భూతంలా నన్ను జీవితాంతం వెంటాడుతుంది....

అది నిజం!....ఇది కల! ఈ నిజం చాలా చేదుగా మింగుడు పడనట్టనపించింది. అప్రయత్నంగా మీనాక్షిని వదిలేశాను...."చటుక్కునలేచి నిల్చున్నాను...."పద వెడదాం మీనాక్షి....ఇంకా పేకింగ్ అది చేసుకోవాలిలావుంది నీవు...." క్షణం క్రితం సంఘటన లేనట్టు సాధ్యమైనంత మామూలుగా అన్నాను.

కారులో వున్నంతసేపూ ఒకటే ఆలోచన! మీనాక్షి రాకుండా వుంటే ఎంత బాగుండేది! ఏదో ఎద్దుబండి అయినా ఒడిదుడుకులు లేకుండా ప్రయాణిస్తున్న నేను ...గుర్రం బండి చూడగానే ప్రలోభపడి ఆ బండిలో ప్రయాణించాలని, కనీసం ఆ వేగంతో సరిగ్గా నా బండి పరిగెత్తించాలని ఆశించాను ఫలితం నాకు హైరాణ! నా ఎద్దుకు నష్టం కలిగింది....కానీ అందుకోలేకపోయాను! అసలు గుర్రం బండి చూశాక గదా ఆ గుర్రంలా నా ఎద్దునీ పరిగెత్తించాలన్న వ్యామోహం!....చూడకపోయివుంటే నేను వెనకబడి వున్నానన్న అసంతృప్తే వుండేదికాదు.

నిజమే....మీనాక్షి రాకుండా వుంటే....యీ దౌర్బల్యం, యీ అశాంతి. యీ అసంతృప్తి ఏమి వుండేవికావు! మీనాక్షి మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తూంది........

ఇంటి గేటుదగ్గిర కారు ఆపేశాను....పెట్రోలు ఎప్టి చూపిస్తూందని గేటు దగ్గరకొచ్చిన డ్రైవరుని కారుతీసికెళ్ళి పెట్రోలు పోయించి రమ్మని పంపాను........

వరండా మెట్లెక్కి డ్రాయింగ్ రూముదగ్గిరకి వచ్చేసరికి లోపల నించి శాంతి, రామావతారం చర్చించుకుంటున్న ఏవో మాటలు వినపడి ఇద్దరం అప్రయత్నంగానే అడుగు వెనక్కివేసి ఆగిపోయాం....

"....నిజం అండీ ఆయనకి నేను తగినదాన్నికాను అనిపిస్తూంది.... నేనేం చెయ్యను....ఆయన అభిరుచులు వేరు, నావివేరు....ఆయనకి కావల్సి నట్టుండడం నాచాతకాదు....నాకేమిటో ఆ క్లబ్బులు పార్టీలు, ఆ వేషాలు అవి నచ్చవు. అవన్నీ ఆయనకి కావాలి....నేనలా వుండనని ఆయనకి కోపం, అసంతృప్తి"

"అలా అని మీరెందుకనుకుంటున్నారు........" రామావతారం అడిగాడు....

"ఎలా .... ఎందుకంటే నేజవాబు చెప్పలేను....కాని ఈ ఇరవై రోజులనించి మీనాక్షిగారు వచ్చిం దగ్గరనించి ఆయన ఎప్పుడూ లేనంత ఉల్లాసంగా వుంటున్నారు. ఆవిడ అన్నింటిలోనూ ఫార్వర్డ్‌గా ఉంటారు....ఆయనకి అలా వుండేవారు నచ్చుతారు........అందుకే అంత

సంతోషంగా వున్నారు... ఆయనకి అలాంటిభార్య కావాలి.... నేను........ నేను....నన్ను పెళ్ళాడి ఆయన సుఖపడ్డం లేదని బాధపడ్తున్నారేమో.... అనిపిస్తూంది...." వ్యధగా వుంది శాంతి గొంతు.

ఆ టాపిక్ అసలు ఎందుకు వచ్చిందో, సంభాషణ ఎలా ఆరంభ మయింది?....బహుశా మీనాక్షి గురించి, నా గురించి ఏదన్నా మాట్లాడు కుంటూంటే....ఈ ఇరవై రోజులుగా నన్ను మీనాక్షిని చూస్తున్న, శాంతి మనసు నొచ్చుకుని వుంటుంది! ఎక్కువ మాట్లాడని శాంతి అపరిచిత వ్యక్తితో ఇన్ని మాటలు మాట్లాడుతూందంటే నిజంగానే ఆమె మనసు కష్టపడి వుంటుంది! గిల్టీగా ఫీ లయ్యాను.

"అలా మీరు బాధపడడంలో అర్థం లేదంటాను........ ఒకవేళ నిజంగా మీవారు అలా ఫీలవుతే అది తాత్కాలిక వ్యామోహం!....అది ఆయనకి యిప్పుడు గాకపోయినా కొన్నాళ్ళకయినా అర్థం అవుతుంది.... నేనూ మొదట్లో మీనాక్షికి తగినవాడిని కాను అనిపించేది! కాని తరువాత ఆలోచిస్తే నాలాంటివాడే మీనాక్షికి వుండాలి అని ధృడపరచుకున్నాను. మా మీనాక్షికి ఇంటిసంగతి పట్టదు! ఎంతసేపు తిరుగుడు కావాలి! ఫ్రెండ్స్, పార్టీలు, పిక్నిక్‌లు, డ్రింక్స్........సోఫిస్టికేటెడ్ లైఫ్‌మీద ఆమెకి మోజు! నేను ఆవిడకు పూర్తి వ్యతిరేకం అందుకే నన్ను ఉత్త బుద్ధావతారం అని తిడ్తుంది! ఆవిడ రమ్మన్నచోటికి రానని కోపగించు కుంటుంది....కాని మీరు ఆలోచించండి....ఆవిడ ఇంటిసంగతి పట్టించు కోదు....పిల్లలు తిన్నారో మానారో, చదువుకున్నారో లేదో ఒక్కసార యినా పటించుకోదు. డబ్బుసంగతి అంతకంటే పట్టించుకోదు, ఇవాళ ఇలా ఖర్చుపెట్టేస్తే రేపటిమాట ఏమిటి అన్న ఆలోచనలేదు........ ఎంతసేపూ రోజుకో చీర, సినిమాలు సరదాలుతప్ప మరో ధ్యాసలేదు. ఎంత టైము లేకపోయినా పిల్లలసంగతి కాస్తోకూస్తో నేనే చూసుకోవాలి....డబ్బు ఇంటికి తీసుకొస్తే మరి మీనాక్షి నిలవనీయదని ముందే బ్యాంకిలో వేసేది వేసి ఇంటికి తీసుకొస్తాను....అరడజను సినిమాలకి వెడదామన్న మీనాక్షిని నేను కంట్రోలుచెయ్యలేక ఆవిడని వదిలేసినా నేను ఒక్కడ్నే వెడతాను....

తప్పనిసరి అయిన పార్టీలకు అటెండ్ అవుతాను. అవసరముందంటేనే పార్టీలు ఇస్తాను....అంతలా మీనాక్షిని ఎన్నివిధాలుగానో వెనకనించి కంట్రోలు చేస్తూంటేనే మా సంసారం ఈ మాత్రం నిలుస్తూంది....సరోజ్ నేనూ మీనాక్షిలాగే వుంటే యింక ఆ సంసారం గతి ఏమిటో మీరే ఆలోచించండి....చూడండి శాంతిగారూ....ఈ సంసారమనేది బండి అయితే భార్యా భర్తలలో ఒకరు గుర్రం, మరొకరు రౌతు అనుకుంటే ....వళ్లూ, పై తెలీకుండా అదుపులేకుండా పరిగెత్తే గుర్రాన్ని అదుపులో పెట్టడం రౌతు కర్తవ్యం! వళ్ళు తెలీయకుండా రౌతూ గుర్రాన్ని పరిగెట్టిస్తే ఆ బండి ఎప్పుడో అప్పుడు బోల్తా పడడం తథ్యం!....అలాగే సంసారంలో భార్యాభర్తలు చూడండి, పొంగేపాలు పొయ్యిలో పడకుండా వుండాలంటే నీళ్ళు చిలకరించేవారు కావాలిగానీ, మరింత మంట ఎగద్రోసేవారుంటే.... గిన్నెడు పాలు బూడిదపాలు అవుతాయి.........యీ సంసారమూ అంతే శాంతిగారూ....భార్యాభర్తలు ఇద్దరూ ఒకలాంటివారే అయివుండాలని కోరుకోడంకంటె విభిన్న మనస్తత్వాల కలయిక అయితేనే ఆ సంసారం రాణిస్తుందా అని నా ఉద్దేశం....సరోజ్ నాలాగే మీనాక్షివుంటే బొత్తిగా ఆ సంసారంలో చైతన్యం లోపిస్తుంది! వెనకనించి మీనాక్షిపోరు ఉండబట్టిగదా అప్పుడప్పుడు సినిమాలు, పార్టీలకు అవీ వెడుతూంటాను.... బొత్తిగా ఆ మాత్రం సరదాలుకూడా లేకుండాపోతే లైఫ్ డల్‌గావుంటుంది! అన్నీ సమపాళ్ళలో వుండాలి....పాలు పొంగిపోతాయని అసలు మంట పెట్టకపోతే ఆ పాలు కాగేదెలా? బండి ఎప్పుడో బోల్తాపడుతుందని అసలు బండిని కదిలించకపోతే గమ్యం ఎలా చేరుతాం? శాంతిగారూ, దేవుడు వెర్రివాడుకాడు యిలాంటి జంటల్ని కూర్చడానికి....కాస్తో కూస్తో బుద్ధిజ్ఞానం వున్నవారెవరైనా ఇలా ఆలోచిస్తే ఆ సంసారంలో కలత లుండవని నా ఉద్దేశం! మీ ఆయన మీరేదో ఆయనతో సరిగా వుండరని అసంతృప్తి అని మీరంటున్నారు....మీరూ ఆయనలాగే నిజంగాఉంటే మీ మీద విముఖత్వం కలగటానికి ఆయనకెన్నాళ్ళో పట్టదు.........సంసారం సరిగా సాఫీగా సాగుతున్నరోజులు లోటుపాట్లు తెలియవు....మీలాంటి భార్య దొరికినందుకు మీవారు అదృష్టవంతులు. అలా ఆలోచించలేని

వారు....ఎవరయ్యేది ఫూల్స్ .... మా మీనా నాకు తగిందికాదని నేను కలలోకూడా అనుకోను ఎప్పుడూ...."

నిబ్బరంగా....ధృడంగావుంది రామావతారం గొంతు. మీనాక్షి నేను యిద్దరం మొహాలు చూసుకున్నాము....మా యిద్దరిమొహాలు మలినం అయ్యాయి....ఒకరి మొహం ఒకరు చూసుకోలేనట్టు వెంటనే చూపులు తప్పించి లోపలికి అడుగుపెట్టాం....రామావతారం చెబుతున్నది ఆపేశాడు మా వైపుచూసి. శాంతి తలెత్తి నా కళ్ళలోకిచూసి చటుక్కునలేచి లోపలికి వెళ్ళిపోయింది.

"ఎప్పుడొచ్చారు....కారు చప్పుడైనా కాలేదే..." రామావతారం ప్రశ్నార్థకంగా....చూస్తూ అడిగాడు.

"పెట్రోలు పోయించుకు రమ్మని డ్రైవరుని పంపాను....ఏమిటో చర్చిస్తున్నట్టున్నారు ఇద్దరూ...." సాధ్యమైనంత మామూలుగా అడిగాను కూర్చుంటూ.

రామావతారం మొహం కాస్త ఎర్రబడింది...."ఆ....ఏదో లోకాభిరామాయణం"....పైపు వెలిగించుకుంటూ క్లుప్తంగా అన్నాడు. మీనాక్షి ఒకసారి నావంకచూసి లోపలికి వెళ్ళింది.

* * *

రాత్రి పదిన్నరకి మీనాక్షిని వాళ్ళని హౌరామెయిల్ ఎక్కించి వీడ్కోలు తీసుకుని ఇంటికి బయలుదేరాం నేనూ, శాంతి.

మీనాక్షి వెళ్ళిపోగానే....ఒక్కసారి తుఫాను వెలిసిన తర్వాత ప్రశాంతిలా హాయిగా వుంది నా మనసు.

రామావతారం మాటలూ విన్న తరువాత ఈ ఇరవై రోజులలో నా కళ్ళకి కమ్మిన పొర ఏదో విడినట్లయింది! నిజంగా అతనన్నట్లు 'ఫూల్'ని నేను!

రామావతారం అన్నమాటలకో మీనాక్షి చెప్పిన నిజం మనసుకి ముల్లులా గుచ్చుకోడంచేతే....ఏదో చెప్పలేనుగానీ ఆ మధ్యాహ్నంనించి నేను నేనులా వుండలేకపోయాను....శాంతినిచూస్తే....పట్టుబడ్డ దొంగని శిక్షించకుండా మంచితనంతో క్షమించి వదిలేస్తే ఆ దొంగ మనఃప్రవృత్తి ఎలావుంటుందో అలా ఫీలయ్యాను....శాంతి మొహంలోకి సూటిగా చూడలేకపోయాను....నేను ఫూల్‌ని....మూర్ఖుడిని....నిజంగా ఫూల్‌ని....

జలపాతం మొదటిసారి చూచినపుడు అబ్బ ఎంత అద్భుతంగావుంది అని అనుకోకుండా వుండలేరు ఎవరూ. కొన్ని నిమిషాలు వివశులై చూస్తారు ఆ అద్భుత ప్రకృతిని। ఆ మనోహర దృశ్యం చూసి కొన్ని గంటలు ఆనందిస్తారు। కానీ .... అద్భుతంగా వుందని....కొన్నిరోజులు విడవకుండా అదే పనిగాచూస్తే....?....ఏ అందమూ కనపడకపోగా....ఆ వేగానికి కళ్ళుతిరిగి పడతాము....ఇంకే శబ్దమూ వినపడనీయని ఆహోరుకి చెవులు దిబ్బడ వేస్తాయి. కాస్త ప్రశాంతి దొరికేచోటుకి పారిపోబుద్ధి వేస్తుంది....ప్రశాంతి లభ్యమయ్యేచోటు వెతుక్కుంటూ వెళ్ళిపోతాం.... హు....నా వ్యామోహం గతి అంతే అవుతుంది.

ఈ ఇరవై రోజులలో మొత్తం పద్ధెనిమిదివందలు ఖర్చయింది।.... డబ్బు మాటేమైనా ...మనసుకి విశ్రాంతి అన్నది ఒక్కక్షణం దొరకలేదు....

కారులో ఓ మూలకి ఒదిగి కూర్చున్న శాంతిని చూస్తుంటే ఎందుకో జాలి అనిపించింది....ఈ ఇరవై రోజులలో మానసికంగానేకాక శారీరకంగా కూడా దూరమైంది నాకు శాంతి....అనురాగంతో నా మనసు నిండిపోయింది.

ఎడంచెయ్యిజాచి శాంతి భుజంచుట్టూ చెయ్యివేసి దగ్గరకి లాక్కున్నాను....“అలా వున్నావేం శాంతీ” అన్నాను ఆదరంగా. ఈ ఇరవై రోజులలో శాంతితో ఆప్యాయంగా మాట్లాడిన మాట ఇదే।

“ఎలా వున్నాను....” తన మామూలు సౌమ్యతతో నెమ్మదిగా అంది శాంతి. గోడలమీద పోస్టర్లపై నయీరోష్‌నీ అన్న “సినిమాపేరు

కన్పించింది. రెండో ఆట ప్రారంభించి చాలా సేపయివుంటుందని తెల్సినా సిల్లీగా" సినిమాకి వెడదామా శాంతీ" అన్నాను. శాంతి ఆశ్చర్యంగా చూసింది "ఇప్పుడా" అంది. అంతలోనే సర్దుకుని "మీ యిష్టం...." అంది.

"వూరికే అన్నాను....వద్దులే...." అన్నాను శాంతిని మరింత దగ్గరగా లాక్కుంటూ. మీనాక్షి రాకతో నా మనసునిండా ఆవరించుకున్న చీకటి తొలగి....'నయీరోష్నీ' ప్రసరించిన యీ రాత్రి సినిమాహాల్లో వృధా చేసేంత 'ఫూల్'ని మాత్రం కాను....కాలేను....

ఏక్సిలేటర్ గట్టిగా నొక్కాను.

—(౦)—